# తలలు పుచ్చిన మనుషులు!

సత్యం, భుజాన్న సంచితో ప్లాట్ ఫారమ్ మీద నించి కంపార్టుమెంటులోకి ఎగిరి తన నంబరు వెతుక్కుంటూ వెళ్ళేటప్పటికి అతని సీట్లో ఎవరో తాతగారు కూర్చుని ఉన్నాడు. ఇటూ అటూ రెండు బల్లలూ కిటకిట లాడిపోతున్నాయి.

సత్యానికి, బట్టల సంచి తప్ప, సామానేం లేదు. సీటు దగ్గిర నిలబడేప్పటికి రైలు నెమ్మదిగా కదిలింది.

ముసలాయన కిటికీలో తలపెట్టి, బయట రైలుతోపాటు నడుస్తోన్న అతనితో "...... మర్చిపోకు! .... తొందరగా పంపెయ్యమని చెప్పు! ..... అవసరానికి తీసుకున్న వాళ్ళు అంత మర్యాదగానూ తిరిగి ఇవ్వాలి ..... ఇక రాకు... ఉండు ..." అంటున్నాడు.

అవతల మనిషి తళతళలాడే ఇస్త్రీ బట్టలూ, 'ట'య్యీ, నిగనిగలాడే బలిసిన మొహమూ... ఏదో పెద్ద ఆఫీసరై ఉంటాడనిపించింది సత్యానికి — ఒక్క చూపుతోనే. అతను కిటికీ బయటినించీ కొంచెం తలవొంచి, ఎదురుగా కనపడ్డ సత్యం వేపు చూస్తూ "... కొంచెం... ఉండండి.... ప్లీజ్" అనో ఏదో అన్నాడు. అంతే వినపడింది సత్యానికి.

బండి స్పీడందుకుంది.

"ఆయన ఏదో అన్నారు. నాకు వినపడలేదండీ" అన్నాడు సత్యం, ముస లాయనతో.

"ఆఁ, ఏం ఉంది? కొంచెం చూస్తూ వుండండి — అన్నాడు... ఏం వుంది చూడ్డానికి? రాత్రి తొమ్మిది కల్లా వెళ్ళేపోతాం" అని విసుక్కున్నాడు ముసలాయన.

"మీ అబ్బాయా?"

"కాదు... అల్లుడు. క్లాస్ వన్ ఆఫీసరుగా చేస్తు న్నాడు."

అల్లుడి మీద విసుక్కోరే ఎవరూ! పైగా అంత దర్జాగా వున్న అల్లుడిమీద!

"మీరు విజయవాడేనా?"

"ఆఁ...."

సత్యం ఎలాగో ముసలాయన పక్కన ఇరికాడు. పావుగంటలోపే లేచిపోయి నిలబడ్డాడు.

ఆయన వొళ్ళు కుంపటిలాగా సెగలు కక్కు తోంది. బట్టలు కూడా ఏదో వాసనగా వున్నాయి. మనిషి ఎర్రటి ఎరుపు. బాగా చదువుకున్న వాడిలా వున్నాడు. కానీ, తలా వొళ్ళూ బట్టలూ మిగలమాసి పోయి వున్నాయి.

"మీకు జ్వరం తగిలినట్టుందే!" అన్నాడు సత్యం, నించున్న తర్వాత.

"ఆఁ ... నాలుగు రోజుల్నించీ వదలడం లేదు."

సత్యం, ఆయన మెడకింద చెయ్యి పెట్టి చూశాడు "101 దాకా వుంటుందేమో అనిపిస్తోంది."

ముసలాయన కొంచెం ప్రసన్నం అయ్యాడు.

"పొద్దున్న 102 వుంది."

"అరే! మరి ఎందుకు బైల్దేరారు?"

".... కొంచెం పనులున్నాయిలెండి. వెళ్ళాలి..... లేచారేం? కూర్చోండి" అంటూ ముసలాయన కొంచెం సర్దుకోబోయాడు.

"వొద్దొద్దు! మీరు సరిగా కూర్చోండి! ఫర్వాలేదు... నించుంటాను."

బస్సెక్కినా రైలెక్కినా ఏదో ఒక పుస్తకం చదువు కుంటూ కూర్చోడం అలవాటు సత్యానికి. సంచిలో రెండు కొత్త పుస్తకాలు పెట్టుకున్నాడు. 'శాక్కో — వాంజెట్టీ' బైటికి తీశాడు. కిటికీ దగ్గరగా నిలబడి 'ముందు మాట' అవగొట్టాడు.

"ఎంత సేపు నించుంటారు? ఇలా కూర్చోండి" అన్నాడు ముసలాయన మళ్ళీ.

"ఫర్వాలేదులెండి. ఎవరన్నా దిగితే కూర్చుం టాను."

"ఒకరు దిగితే పది మంది ఎక్కుతారు" అని ముసలాయన విసుక్కున్నాడు.

నెమ్మదిగా అప్పుడో మాటా అప్పుడో మాటా సాగాయి.

ముసలాయన పేరు ఏదో శర్మ. వయసు డెబ్భై నాలుగో మూడో ఐదో దాటాయి. రెండేళ్ళ కిందట భార్యపోయింది. ఈయన విజయవాడలో పదేళ్ళ

కిందటి దాకా ఇంగ్లీషు లెక్చెరరుగా ఫలానా ఫలానా కాలేజీల్లో చేశాడు. అక్కడ స్వంత ఇల్లు వుంది. కొడుకు అమెరికాలో! ఏదో ఇంజ నీరు! ఈయన విజయవాడలో ఫలానా చోట ఒక్కడే వుంటాడు. పని మనిషి వొండిపెడుతుంది. హైదరాబాదులో ఫలానా ఆఫీసర్స్ కాలనీలో కూతురు వుంది. కూతురి దగ్గిరికి వొచ్చి నెల రోజులైంది. ఇప్పుడు అక్కడినించే బైల్దేరాడు.

కుడి చేతికి రెండు బంగారం ఉంగరాలు! ఒక ఉంగరం మీద ఏదో బాబా బొమ్మ! రెండో ఉంగరం ఆకు పచ్చ రాయితో తళతళా మెరిసిపోతోంది! ఆ రాయిని పచ్చేగిచ్చే ఏదో అంటారు. చాలా ఖరీదు వుంటుంది!

లుంగీ, చొక్కా — రెండే వొంటిమీద! అవి కూడా నలిగిపోయి! మాసిపోయి! చొక్కాకి గుండీలు వూడి! లుంగీ, కాళ్ళ దగ్గిర చిరిగి!

ఆఫీసర్స్ కాలనీలో కూతురేమిటీ! కూతురి దగ్గి ర్నించి వొస్తూ ఈ బికారి వేషం ఏమిటీ! పైగా, ఇంత జ్వరంతో!

పాపం ఈయన్ని సరిగా చూసుకోవడం లేదా? ... ఒకరు చూసేదేమిటి? ... నిన్న మొన్నటిదాకా మంచి ఆదాయమే. స్వంత ఇల్లూ! ... అమెరికాలో కొడుకూ! ఏమీ పంపడా? అక్కడికిపోయిన వాళ్ళు డబ్బు బాగానే పడేస్తారే 'గొప్పల'కోసం అయినా! ..... ఒకడు పంపే దేమిటి? ఆ పచ్చరాయి ఉంగరం అమ్ముకుంటే పది తరాలు బతకొచ్చు!

సత్యం, ఏదేదో ఊహించాడు. పొంతన కుదరడం లేదు.

హఠాత్తుగా... జనం... బాంబు పేలినట్టు బల్లల మీదనించీ భీతెత్తిపోయి పరుగులు తీశారు. గాలిలో గుప్పున .... ఏదో కుళ్ళు వాసన! క్షణంలో రెండు బల్లలూ ఖాళీ అయిపోయాయి!

ముసలాయనకి విరోచనం అయింది, లుంగీలో, బల్లమీద! ఆయన వొణికిపోతూ లుంగీని పైకి పట్టు కుని బల్లమీద నించీ లేచి లెట్రిన్ వేపు బైల్దేరాడు. ఒక చేత్తో పైబల్లలు పట్టుకుంటూ తూలిపోతూ అడుగులు వేస్తున్నాడు.

సత్యానికి, సంగతేమిటో అర్థమయ్యేటప్పటికి ముసలాయన అంత దూరంలో కనపడ్డాడు, తూలుతూ!

"అయ్యయ్యో! ఉండండి! పడిపోతారు" అంటూ సత్యం, తన సంచి పైబల్లమీదకి విసిరేసి అటు పరిగెత్తి శర్మని పట్టుకున్నాడు.

లెట్రిన్ దాకా నడిపించి లోపలికి తీసుకువెళ్ళి కూర్చోబెట్టాడు. లుంగీ ఊడ దీసి ఉండచుట్టి లెట్రిన్ బైట ఒక మూల పడేశాడు. "కూర్చోండి, వొస్తాం" అని బైటికి పరిగెత్తుకొచ్చి శర్మ సామాను వెతికాడు. ఒక సంచిలో కొన్ని బట్టలు కనపడ్డాయి. అన్నీ మాసిపోయి చుట్టలు చుట్టివున్న లుంగీలే. వాటిలోనించే ఒకటి తీశాడు. ఇటూ అటూ చూస్తే లోటా లాంటిదేదీ లేదు. పక్క బల్లల మీద ఇరుక్కున్న వాళ్ళ దగ్గిరికి పోయి "ఎవరి దగ్గరన్నా ఒక లోటా వుంటే ఇవ్వండి" అని అడిగి, తనే ఇటూ అటూ వెతికాడు.

ఎవరో కాఫీ కప్పంత లోటా అందించారు. చేతికి లోటా అందగానే లెట్రిన్ వేపు పరిగెత్తాడు.

భీతెత్తి నలుదిక్కులకూ చెల్లాచెదురై పోయి నించున్న వాళ్ళంతా సత్యాన్నే విస్తుబోయి చూస్తూ నిలబడ్డారు.

సత్యం, ఆ లోటా, ఆ లుంగీ పట్టుకుని లెట్రిన్‌లో దూరాడు. వాసన దుర్భరంగా వుంది. ముసలాయన కూర్చుని మూలుగుతున్నాడు.

"ఆరోగ్యంగా వున్న మనిషికి అయితే... ఇలాంటి వాసన వుండదు. ఈయన కడుపు చాలా పాడైపోయి నట్టుంది. ఉత్త మూర్ఖుళ్ళా వున్నాడే! ఆరోగ్యం ఇంత చెడగొట్టుకున్నాడు! ఉంగరాలవీ బాగానే పెట్టు కున్నాడే!" అనుకుంటూ సత్యం లెట్రిన్ బయటికి రెండడుగులు వేసి గబగబా నాలుగుసార్లు బయటి గాలి పీల్చుకుని లోపలికి వెళ్ళాడు.

ముసలాయన తెగ మూలుగుతున్నాడు. చలితో వొణికిపోతున్నాడు. నించోబెడితే తూలిపోతున్నాడు. సత్యం భుజంమీద చేతులు వేసి నిలబడ్డాడు.

సత్యం, ముసలాయన చొక్కాని పైకి తీసి గుండెలమీద గట్టిగా ముడేశాడు. తర్వాత ఒక వంద లోటాల నీళ్ళుపోసి మొలదగ్గిర్నించీ కడిగాడు. మొల దగ్గిర మొలతాడూ, దానికో తాయెత్తూ కూడా! కడ గడం పూర్తిచేసి, అప్పటిదాకా తన భుజంమీద వేసు

కున్న కంపు లుంగీ విప్పి ఆయన మొలకి చుట్టి, చెయ్యి పట్టుకుని నెమ్మదిగా బైటికి తీసుకొచ్చాడు.

"వొస్తున్నాడు, వొస్తున్నాడు" అని జనం మళ్ళీ ఇటూ అటూ పరుగులు తీశారు.

సత్యం, శర్మని నడిపించుకుని తీసుకు వొచ్చి రెండో బల్లమీద కూర్చోబెట్టాడు.

ఖరాబైన చోట శుభ్రం చేస్తేనే గానీ, రెండో బల్ల దగ్గిర నించోడం కూడా సాధ్యమయ్యేలాగ లేదు. ఇటూ అటూ చూస్తే ఒకాయన చేతిలో పేపరు కన పడింది. సత్యం అటు పరిగెత్తి "బల్ల తుడవాలి. లేక పోతే ఇక్కడ ఉండలేం. పేపరు ఇవ్వండి!" అని, ఆయన ఇవ్వకముందే దాన్ని లాక్కున్నాడు. దాన్ని ముక్కలు ముక్కలు చేసి వాటిని చాలా పొదుపుగా వాడుతూ బల్ల తుడిచి ముక్కలన్నీ కిటికీలోంచి బైట పారేశాడు. శర్మ సంచిలోంచి ఒక లుంగీ బైటికిలాగి, దాన్ని తడిపి తెచ్చి దానితో బల్లంతా తుడిచి దాన్ని కిటికీలోంచి బైటకి విసిరాడు. తర్వాత వాష్ బేసిన్ దగ్గిరికి డజన్ సార్లు తిరిగి ఆ లోటాతో నీళ్ళు తెచ్చి బల్ల కడిగాడు. ఆ నీళ్ళు అందరి కాళ్ళకిందకీ పాక కుండా చెప్పుల కాళ్ళతో వాటిని గుమ్మం వేపు మళ్ళిం చాడు. తర్వాత తనుకూడా కాళ్ళూ చేతులూ కడుక్కుని చివరికి లోటాని దాని యజమానురాలి దగ్గిరికి తీసుకుపోయి "సుబ్బరంగా కడిగానులెండి. ఇంటికి వెళ్ళాక సబ్బుతో కడగండి బాగా" అని చెప్పి తన స్థావరానికి తిరిగి వచ్చాడు.

వాసన తగ్గింది. అయినా ఫాను ఫుల్‌గా పెంచాడు. అంతలోనే ముసలాయనకి చలిగా వుందని గుర్తొచ్చి ఫాను తగ్గించాడు.

ఇప్పుడు ఇద్దరికీ చెరో బెంచీ! మూడో ప్రాణి ఎవరూ ఇటు తొంగి చూడరు ఇక!

ముసలాయన నీరసంగా పడివున్నాడు. కొంచెం వేడివేడిగా ఏదన్నా తాగిస్తే బాగుంటుందేమో అని పించింది.

సత్యం మళ్ళీ ఆయన సామానులు వెతికాడు. పెట్టీ, సంచీ! సంచినిండా మాసిన గుడ్డలే. పెట్టిని ఇటూ అటూ తిప్పితే, మూత తెరుచుకుంది. అందులో పేంటులూ షర్టులూ బనీన్లూ అన్నీ మాసినవే. ఒక బనీను తీసి బల్లంతా మళ్ళీ తుడిచి దాన్ని కిటికీలోంచి బైటపారేశాడు. ఫ్లాస్కుగానీ, మంచినీళ్ళ సీసాగానీ, తువ్వాలుగానీ ఏదీ లేదు. కాసిన్ని పాలో కాఫీయో పోసి విడిగా బుట్టలో పెట్టొద్దూ కూతురు? ... ఈయనకైనా తెలీదూ, మళ్ళీ చేతికి రెండు ఉంగరాలు పెట్టాడు! జ్ఞానం లేని మనిషిలా ఉన్నాడే!

"మీ సంచిలో బట్టలన్నీ మాసినట్టే వున్నాయండీ!" అని ఆశ్చర్యపోతూ అన్నాడు సత్యం.

"అవన్నీ... విడిచినవేలెండి" అని మూలిగాడు ముసలాయన.

"విడిచినవి" అయితే మాత్రం? విడిచిన బట్టలు కూడా పువ్వుల్లాగ ఉండొద్దూ? బొగ్గు గనుల్లో పనిచేసే వాళ్ళ గుడ్డల్లాగ అయ్యేదాకా తొక్కి తొక్కి అప్పుడు విడుస్తారా?

"ఫ్లాస్కు వుంచుకోవలసింది. ఐదారు గంటలు ప్రయాణం. అంతసేపు ఎలా వుంటారు ఏమీ తాగ కుండా? పైగా జ్వరంతో బైల్దేరారు."

మాట్లాడలేదు ముసలాయన.

సత్యం మళ్ళీ పుస్తకం తెరుద్దామా అని లేచి పైబల్లమీద సంచిని ఇవతలికి లాగి పుస్తకం తీశాడు.

లేచాడు ముసలాయన మళ్ళీ వొణుకుతూ.

"ఏమిటి? మళ్ళీ వెళ్తారా?"

"మీరక్కర్లేదు, మీరక్కర్లేదు. నేవెళ్ళగలను" అంటూ శర్మ తూలుకుంటూ నాలు గడుగులు నడిచి అక్కడ పక్కవాళ్ళమీద పడ్డాడు.

వాళ్ళంతా హాహాకారాలతో చెల్లా చెదురయ్యారు.

సత్యం పరిగెత్తి శర్మని పట్టుకుని లెట్రిన్ దాకా తీసికెళ్ళి మళ్ళీ కూర్చోబెట్టాడు. లోటాకోసం బైటికి పరిగెత్తుకొచ్చాడు. పావుగంట దాటాక ముసలాయన్ని నడిపించుకు వచ్చి బల్లమీద కూర్చోబెట్టాడు. లోటా ఇచ్చేద్దామని, దాని స్వంతదారుదాకా వెళ్ళి "ఎందు కన్నా మంచిది — తర్వాత ఇస్తాలెండి. నా దగ్గిరే ఉంచుతాను" అని, "ఉంచుకోనా" అని అనుమతి అడిగాడు.

"అయ్యయ్యో, దానికేం? అలాగే తీసికెళ్ళండి" అని లోటా యజమానురాలూ, ఆ పక్క వాళ్ళూ కూడా లోటాని కొన్ని గంటలపాటు వొదిలెయ్యడానికి ఆనం దంగా వొప్పేసుకున్నారు.

సత్యం, లోటాని తెచ్చి బల్లకింద పెట్టి "ఎందు

కన్నా మంచిదని ఇక్కడే ఉంచుతున్నాలెండి" అని ముసలాయనతో చెప్పి, తన బల్లమీద కూర్చున్నాడు.

ముసలాయన ఏడుపు ఒక్కటే తక్కువ! ఇంకా ఎన్నిసార్లు వెళ్ళినా కడుగుతానని చెపుతున్నాడన్న మాట ఈ కుర్రాడు! ముందుకు వొంగి అమాంతం సత్యం చేతులు పట్టుకున్నాడు. "అయ్యా! మీరు లేకపోతే ఈ పాటికి నేనా లెట్రిన్ గదిలోనే పడి చచ్చి వుండే వాడిని. ఇంత చిన్న వయసులో ఎంత దొడ్డ మనసు మీకు! మిమ్మల్ని నాకా స్వామీజీయే చూపించాడు! స్వామీజీయే చూపించాడు! ఆయన మహిమలు ఊహాతీతం!" అంటూ కంఠం వొణికిపోతూ ఆగాడు.

సత్యానికి వొళ్ళు మండిపోయింది. స్వామీజీ చూపించాడా తనని? తను దొరికాడా స్వామీజీకి? కృతజ్ఞత చూపించాలంటే అదా పద్ధతి? "ఏవిటండీ మీ స్వామీజీ మహిమ? రైల్లో మీకు ఇంత అర్ధాంతరంగా ఇలా జరగకుండా ఆపలేకపోయాడుగానీ, కడగడానికి నన్ను చూపించాడా?" అన్నాడు సత్యం మొహం చిట్లిస్తూ.

"అలా అనకండి! అలా అనకండి! మీ మేలు వెయ్యి జన్మలకి కూడా మరచిపోలేను" అని ముసలాయన మళ్ళీ మూలిగాడు.

"సర్లెండి, మీకు చాలా జ్వరంగా వుంది, మాట్లాడకండి! కాస్సేపు అలా పడుకోండి."

"మీరు లేకపోతే... నేనేమైపోయే వాడిని?"

"ఏం, మీ స్వామీజీ నన్ను తప్ప ఇంకెవర్నీ చూపించడా?"

"మీలాంటి వాళ్ళు .... ఎంత మంది ఉన్నారు లోకంలో? స్వామీజీ మాత్రం ఏం చేస్తాడు?"

సత్యం నవ్వాడు. ఈ 'భక్తుల'నే వాళ్ళు భలే సరిపెట్టుకుంటారు ప్రతీదానికీ! ఏదో గొప్ప జవాబు చెప్పుకుంటున్నాం అనుకుంటూ అన్నీ కుళ్ళుతర్కాలు చేస్తారు!

"ఈ స్వామీజీలూ బాబాలూ అందరూ మామూలు మనుషులేనండీ! మనుషుల దగ్గిర ఏం మహిమలు వుంటాయి? ఆ జుట్టూ ఆ ముసుగులూ అవన్నీ పెద్ద మోసం! మీ స్వామీజీకి ఆ జుట్టంతా క్షవరం చేసి, మనలాగే క్రాపు పెట్టి, మామూలుగా చొక్కా పైజమా వేసి ఒక బల్లమీద కూర్చోబెట్టండి! అప్పుడు తెలుస్తుంది, అతనూ మామూలు మనిషేనని!"

ముసలాయన కొంచెం నవ్వాడు. కానీ, నిర్ఘాంతపోతూ! బాబాల్నీ స్వామీజీల్నీ అంత లెక్క లేకుండా 'తీసిపారేసే' మనిషిని ఆయన అప్పటిదాకా చూడలేదు.

పక్క 'గడి'లో బెంచీమీద ఒకాయనకి 'స్వామీజీ నింద' చెవినబడి సత్యంతో వాదం వేసుకోవాలని ఉద్వేగం పొంగిందిగానీ, ముసలాయన వున్న వేపు తొంగిచూస్తే, మెడకేం చుట్టుకుంటుందోననే భీతితో అటు తల తిప్పలేదు. కానీ ఎంతో సేపు ఆగలేక అక్కడినించే "భగవంతుడు కూడా మనిషి రూపంలోనే పుడతాడండీ" అన్నాడు గట్టిగా.

ఆ మాటలు చెవిన పడగానే సత్యం ఇక్కడినించీ "ఏం, భగవంతుడు మనిషి రూపంలోనే ఎందుకు పుడతాడు? గేదె రూపంలో ఎందుకు పుట్టడూ? మేక రూపంలో ఎందుకు పుట్టడూ? కుక్కలకీ నక్కలకీ దేవుళ్ళు ఎందుకు లేరు?" అని అరిచాడు.

ముసలాయన ఇటూ అటూ కదిలాడు.

"వెళ్తారా మళ్ళీ?"

"కాదులెండి. నడుం నొప్పిగా వుందనీ....."

ముసలాయన మూలుగులతో, ఉత్సాహంగా తలెత్తిన చర్చ ఆదిలోనే ఆగిపోయింది. అవతలి నించీ అరిచిన భక్తుడు మళ్ళీ కిక్కురుమనలేదు — ముసలాయన భీతితో!

సత్యం కూడా ఆ ప్రసక్తి తొందరగానే వొదిలేసి ముసలాయనకి ఆరోగ్యం మీద ఉపన్యాసం ఇచ్చాడు "ఈ వయసులో బాగా ఆరోగ్యంగా ఉంటేగానీ ప్రయాణాలు చెయ్యకూడదండీ! అప్పుడైనా, ఫ్లాస్కులో కాసిన్ని పాలూ, మంచినీళ్ళూ, పళ్ళూ అవీ పెట్టుకోవాలి. ఒంట్లో బాగోలేనప్పుడు ఎవరన్నా సాయం వుంటేనేగానీ బైల్దేరకూడదు."

"హు, సాయం! ఆ భగవంతుడే సాయం!" అని మూలిగాడు ముసలాయన.

"భగవంతుడా సాయం? అయితే మీకు సాయం దొరికినట్టే! మనుషుల్ని నమ్ముకోండి, ఎక్కడా లేని భగవంతుణ్ణి కాదు. 'తోటి మనుషులు ఎవరో ఒకరు సాయం చెయ్యరా' అనండి! అది బాగుంటుంది."

ముసలాయన సత్యానికి ఎదురు మాట్లాడలేదు. ఏం మాట్లాడతాడు? అప్పటికి రెండుసార్లు కడిగాడు. ఇంకా లోటా దగ్గిర పెట్టుకుని కూర్చున్నాడు, మళ్ళీ కడగడానికి! అతనితో ఇంకేం మాట్లాడతాడు? "మీరు విజయవాడ ఎందుకు వొస్తున్నారు? ... మీ పనేమిటో అడగనే లేదు" అని సత్యం గురించి ఆసక్తి చూపించాడు శర్మ అప్పటికి!

సత్యం తన పేరు చెప్పి "మీకన్నా చిన్న వాడినేగా? 'మీరు' అనడం ఎందుకు? 'సత్యం' అనండి చాలు" అన్నాడు. తర్వాత తన వివరాలన్నీ చెప్పుకొచ్చాడు. ఐదారు వారాల క్రితం సత్యం స్నేహితుడొకతనికి, విజయవాడలో సైకిల్‌మీద పోతూవుంటే లారీ గుద్ది చాలా ప్రమాదం అయింది. ఎలాగో గాయాలతో బతికి బయటపడ్డాడు.

రేపో మాపో ఆస్పత్రినించి కూడా ఇంటికి రాబోతున్నాడు. మొత్తానికి చాలా ఖర్చుతో, ప్రాణాలతో, బయటపడ్డాడు. అప్పటినించీ సత్యం ప్రతీవారం విజయవాడ వెళ్తూనే ఉన్నాడు.

"ప్రతీవారం వచ్చి చూస్తున్నారా?" అని శర్మ ఆశ్చర్యపడ్డాడు.

"అసలు నేను అక్కడే ఉండవలసినంత అవసరమండీ! కానీ, వీలవదు. అంత సెలవు దొరకదు. రోజూ ఫ్యాక్టరీ... షిఫ్టులూ ..... మొదట్లో కొన్నాళ్ళు ఉన్నాను గానీ ... ఇప్పుడు ప్రతీవారం వెళ్ళిచూస్తున్నాను."

సత్యం, ఆ కబుర్లతోపాటు తన స్వంత కబుర్లు కూడా కొన్ని చెప్పాడు, శర్మ అడుగుతోంటే. భార్య పేరు శాంత. లాయరుగా పనిచేస్తోంది. ఇద్దరు ఆడపిల్లలు. తల్లి పేరు సుందరమ్మ. చెల్లెలి పేరు జానకి.

"మా జానకి కొన్నాళ్ళు విజయవాడలోనే ఉండేదండీ. వెంకట్రావు అనీ, ఒక వెధవతో పెళ్ళయింది మొదట. చాలా దరిద్రుడు లెండి. రెండేళ్ళపాటు దాన్ని కాల్చుకు తినేశాడు. జానకి అసలే గోవులాంటి మనిషి. నోట్లో నాలిక లేనట్టు ఉండేది. అలాంటి మనిషి కూడా వాడికి ఎదురు తిరిగింది. వెధవని వొదిలేసి వొచ్చేసి ఉద్యోగంలో చేరింది. తనకి నచ్చిన వాణ్ణి మళ్ళీ పెళ్ళి చేసుకుని హాయిగా ఉంది. ఆ వెధవ ఇంకో అమ్మాయిని పెళ్ళిచేసుకుని ఆ అమ్మాయిని కూడా కాల్చుకు తింటోంటే, ఆ అమ్మాయి కూడా వొదిలేసింది లెండి. మంచి పని చేసింది" అని ఉత్సాహం ఉరకలు వేస్తోంటే, చెప్పుకుపోయాడు. ఆ కబుర్ల మీద ముసలాయనకి ఆసక్తి ఉండదని సత్యానికి తెలుసు. అయినా, రైల్లో అంత మందికి వినపడేలాగ వెంకట్రావుని తిట్టాలనే ఉత్సాహం ఆపుకోలేక అదంతా చెప్పేశాడు.

ఏమో! వెంకట్రావు ఫ్రెండెవడైనా ఈ పెట్లో ఉండి ఉండకూడదా? వాడు ఈ మాటలన్నీ విని వెళ్ళి వెంకట్రావుతో "నిన్ను రైల్లో ఎవరోగానీ బాగా తిట్టారు" అని చెప్పకపోతాడా? పోనీ, ఇంకో వెంకట్రావు ఎవడైనా ఈ పెట్లో ఉండడా? వెంకట్రావుని తిట్టే తిట్లు ఎప్పుడూ వృధాగా పోవు, వాళ్ళు ఎక్కడ చూసినా ఉంటారు కాబట్టి! — అదీ సత్యం నమ్మకం! అందుకే సందర్భం లేకపోయినా వెంకట్రావుని తిడతాడు.

"మీకు... ప్రమోషన్... వొస్తుందా?" అన్నాడు శర్మ మూలుగుతూ, అతి కష్టం మీద. అంత మూలుగుల్లో ప్రమోషన్ వస్తుందో రాదో తెలుసుకోడం ఎందుకో!

"ప్రమోషన్లు అంటే నెమ్మదిగా పని వొదిలేసి మేనేజిమెంటులోకి చేరడమేనండీ! అది నాకు ఇష్టం లేదు."

శర్మ అంత నీరసంలోనూ చాలా గట్టిగానే ఆశ్చర్యపోతూ "మీరు... కమ్యూనిష్టా?" అన్నాడు మళ్ళీ.

సత్యం నవ్వి "ఎందుకలా అనుకున్నారు?" అన్నాడు.

"మీ మాటలు వింటోంటే..."

"నాస్తికుడేమో అనుకోవచ్చుగా? 'కమ్యూనిష్టా' అని ఎందుకన్నారు?"

"కాదులెండి ..... నాస్తికులు ఇవన్నీ మాట్లాడరు ..... ఈ రోజుల్లో కమ్యూనిస్టులు కూడా అన్నీ వొదిలేశారు లెండి" అన్నాడు నీరసంగా.

అయన కూడా చిన్నప్పుడు కమ్యూనిస్టు పార్టీలో తిరిగేవాడట! నాస్తిక భావాలతో ఉండేవాడట! క్రమంగా అందరూ మారిపోతోంటే తనూ మారిపోయాడట! ఆ తర్వాత ఈ స్వామీజీని నమ్ముకుంటే 'శాంతి' దొరికిందట! "కాబట్టి, ఎప్పటికైనా మీరూ.... మారవలసిందే..." అని ముగించాడు.

సత్యం నవ్వి పుస్తకం తీశాడు.

కంపార్టుమెంటులో వాళ్ళంతా సత్యానికి నమస్కా

రాలు ఒక్కటే తక్కువ. అతనే లేకపోతే ఆ ఉపద్రవం ఎవరిమీద 'పడి పోయేదో' అని అందరూ బెంబేలెత్తి పోయి ఉన్నారు. 'ముసలాయన దిగక ముందే సత్యం ఎక్కడన్నా మధ్యలో దిగిపోతాడా' అని సందేహాలు వచ్చిన వాళ్ళంతా "మీరు ఎందాకా? ఆయన ఎందాకా?" అని వాకబులు చేసి సంతోషించారు.

"మీరేమవుతారు ఆయనికి?" అని చాలామంది అడిగారు సత్యాన్ని.

"మీలాగే అవుతాను. తోటి ప్రయాణీకుణ్ణి, అంతే" అన్నాడు సత్యం.

"మీలాంటి మనిషి ప్రపంచంలో ఉండడండీ! నేనైతే చేసేవాణ్ణి కాదు" అన్నారు చాలామంది.

సత్యం నవ్వి — "ఇప్పుడలాగే అంటారు. సందర్భం వొస్తే మీరే చేస్తారు" అన్నాడు.

"కాదు. నేను చెయ్యలేను."

"మీ కళ్ళముందే ఆయన పడిపోతే, ఆయన్ని పట్టుకోక ఏం చేస్తారు?"

"ఊరికే పట్టుకోవడం కాదు గదా? అవన్నీ ఎవడు చేస్తాడు? ఏమో! మా వల్ల కాదు బాబూ!" అన్నారు అందరూ ఏకగ్రీవంగా.

ముసలాయన అప్పటికి వొత్తిలాగా వేళ్ళాడబడి పోయాడు. కళ్ళు కూడా తెరవలేకపోతున్నాడు. శవం లాగా బల్లమీద పడి ఉన్నాడు. కడుపులో పేగులు బయటపడేంత కంపు మనిషి దగ్గిర.

మళ్ళీ వెళ్ళవలసి వొస్తే లెట్రిన్‌దాకా నడవలేడు. బల్లమీద వెళ్ళవలిసిందే.

"సరే, నిండా మునిగిన వాడికి చలేమిటి? అలాగే కడుగుతాను" అనుకున్నాడు సత్యం. మళ్ళీ పుస్తకం ముట్టుకోడానికి సందు దొరకలేదు.

"వచ్చే స్టేషన్‌లో స్టేషన్ మాస్టర్‌కి చెప్తేసరి. రైల్వే హాస్పిటల్‌లో ఏదో ఉంటుందిగా? అందులో చేర్చు కుంటారు వాళ్ళే" అన్నారెవరో.

స్పృహలేనట్టుగా పడివున్న శర్మని చూస్తోంటే, బల్లమీదే చచ్చిపోతాడేమో అనిపించింది సత్యానికి. కంపార్టుమెంటులో ఇటూ అటూ పరిగెత్తి — "ఎవరి దగ్గరన్నా కొంచెం పాలన్నా, కాఫీ అన్నా వుంటే ఇవ్వండి. లేకపోతే ఆయన చచ్చిపోయేలాగ ఉన్నాడు" అని అందర్నీ అడిగాడు.

పిల్లలు ఉన్న వాళ్ళందరి దగ్గిరా ఫ్లాస్కుల్లో పాలు న్నాయి. ఇద్దరు ముగ్గురు గబగబా ఫ్లాస్కులు అందిం చారు. సత్యం, ఒకటి అందుకుని ముసలాయన దగ్గిరికి పరిగెత్తాడు.

వేడిపాలు కడుపులోకి దిగేప్పటికి ముసలాయన కొంచెం కళ్ళు తెరిచాడు. అప్పటికి జ్వరం కూడా తగ్గింది. పాలు తాగి నిద్రలోకి జారిపోయాడు.

ఆరు గంటల నరకం తర్వాత, విజయవాడ స్వర్గం కనుచూపు మేరలో కొండల మీద దీపాలతో దూరంగా ప్రత్యక్షమైంది.

కంపార్టుమెంటులో వాళ్ళంతా సామాన్లు సర్దేసు కుని బండి ఆగకముందే కిందకి దూకెయ్యడానికి గుమ్మాల దగ్గిరికి చేరిపోయారు.

సత్యం, ఫ్లాస్కూ లోటా గ్లాసూ, ఎవరివి వాళ్ళకి అప్పజెప్పేశాడు.

బండి ఆగకముందే పెట్టంతా ఖాళీ! ఇద్దరే మిగిలారు.

శర్మ లేచాడు. బాగా తేరుకున్నట్టు కనిపించాడు. "కొంచెం స్టేషన్ బయటిదాకా సాయంవుంటే చాలు. బస్సులో వెళ్ళిపోతాను. మా ఇంటిముందే ఆగుతుంది బస్సు" అన్నాడు.

సత్యం ఆశ్చర్యపోతూ చూశాడు. "బస్సులో వెళ్తారా? భలే మనిషిలాగా వున్నారే! చాలుగానీ ఆటోలో వెళ్ళండి! టాక్సీ దొరికితే టాక్సీలో వెళ్ళండి. పోర్టర్లని పిలుస్తాను. వీల్ ఛెయిర్ తెస్తారు. మిమ్మల్ని వాళ్ళే బయటికి తీసుకుపోయి ఎక్కిస్తారు."

"అబ్బెబ్బే... అవన్నీ ఎందుకండీ? నేనిప్పుడు బాగానే ఉన్నాను. నడిచి రాగలను. బస్సెక్కిస్తే చాలు!"

అబ్బా! ఎంత బుద్ధిలేని మనిషో!

సత్యం కఠినంగా అన్నాడు, "బొత్తిగా తెలివి మాలిన మనిషిలాగా ఉన్నారే! మీ జీవితం మీద మీకేమీ విలువ ఉన్నట్టు లేదే!"

"అదికాదండీ, వాళ్ళు ఏ యాభయ్యో అడుగు తారు."

"అవును, అడుగుతారు! ఇవ్వండి! ఇవ్వకపోతే మిమ్మల్నీ మీ సామానుల్నీ అంత దూరం ఎలా మోసుకుపోతారు? డబ్బు లేదా మీ దగ్గిర? లేకపోతే

ఆ స్వామీజీ ఉంగరం ఇచ్చెయ్యండి! దానితో మీకు ఇంతకన్నా మంచి అవసరం ఎప్పుడూ రాదు."

ముసలాయన అప్పటికీ ఇంకా మొరాయిస్తే "నీ చావు నువ్వు చావు! నా దారిన నేను పోతున్నా!" అని చెప్పేసి ప్లాట్‌ఫారం మీదకి దూకేద్దామని సత్యం నిర్ణ యించేసుకున్నాడు. భుజానికి సంచి తగిలించేసు కున్నాడు.

సత్యం కోపానికి ముసలాయన బెదిరిపోయాడు. "మీ ఇష్టం! మీ ఇష్టం వచ్చినట్టే చెయ్యండి!" అని గొణిగాడు.

సత్యం, పోర్టర్లని పిలిచి వీల్ ఛైర్ కావాలని చెప్పాడు.

అంతా చకచకా జరిగింది.

ముసలాయన్ని ప్లాట్‌ఫారమ్ మీదకి దించారు. కుర్చీలో కూర్చోబెట్టారు.

ఇంకో పోర్టరు సామాను ఎత్తుకున్నాడు.

తీరా కుర్చీ కదిలే ముందు శర్మ జంకుతూనే "...పాయిఖానా తలుపు దగ్గిర పెట్టారే... ఆ లుంగీ" అని గొణిగాడు.

"ఆఁ... మర్చేపోయా..." అంటూ సత్యం అటు వెళ్ళబోయి, వెనక్కి తిరిగి "ఛీ! ఛండాలంగా ఉంది అది. దాన్నెవరు ముట్టుకుంటారు? అడుక్కునే వాళ్ళె వరైనా తీసుకుంటే తీసుకుంటారు. లేకపోతే అవతల పారేస్తారు" అన్నాడు.

శర్మ తెల్లబోతూ — "అది చాలా కొత్తదండీ. కొని నెల్లాళ్ళన్నా కాలేదు" అన్నాడు.

"అందుకని నేను మళ్ళీ దాన్ని ముట్టుకోవాలా?" అన్నాడు సత్యం కళ్ళెర్రజేసినంత పని చేసి. "కొత్తదైతే, దాన్ని బాగుచేసుకున్న వాళ్ళకి కొన్నాళ్ళన్నా పని కొస్తుంది" అన్నాడు మళ్ళీ కొంచెం శాంతంగా నవ్వి.

శర్మ, కిక్కురుమనలేదు. కొని నెల్లాళ్ళన్నా అవని తన ఆస్తిమీద ఆశ వొదిలేసుకున్నాడు.

పోర్టరు కుర్చీని లాక్కుపోబోతోంటే సత్యం శర్మతో "వెళ్ళగానే వేడినీళ్ళతో తలారా స్నానం చెయ్యండి. నీళ్ళు కాచడానికి ఇంట్లో ఎవరన్నా ఉంటారా లేరా?" అన్నాడు.

"ఉన్నారులెండి... ఒకసారి మా ఇంటికి వస్తారా రేపు?"

"...... రేపు కాదు, ఎప్పుడైనా వీలైతే చూస్తాను."

"మీరు చేసింది వెయ్యి జన్మలకి కూడా మర్చి పోలేను" అంటూ చేతులు జోడించాడు శర్మ.

"ఛ! అదేం పని? అలా చెయ్యకండి!" అని సత్యం కొంచెం నవ్వాడు.

"మీరు తప్పకుండా మా అమ్మాయి గారింటికి ఒకసారి వెళ్ళాలి."

"ఎందుకూ? మీ అమ్మాయి మీద నాకు చాలా కోపంగా ఉంది ..... తండ్రిని ఎంత బాగా చూసు కుంటుందో తెలిసిందిగా?"

"మిమ్మల్ని చూస్తే మా అమ్మాయి చాలా సంతో షిస్తుందండీ!"

"అంత సంతోషిస్తుందా? అయితే, మా ఇంటికి వచ్చి నన్ను చూడమనండి!"

శర్మ ఆశ్చర్యపోతూ నోరు తెరిచాడు 'ఇంత తెగేసి మాట్లాడుతున్నాడేవిట'న్నట్టు!

"వెళ్తానండీ!" అని శర్మతో చెప్పి, పోర్టర్స్‌తో "మీరే ఆటోలో కూర్చోబెట్టండి!" అని చెప్పి, సత్యం తన దారిన తను చకచకా వెళ్ళిపోయాడు.

★ ★ ★

సత్యం పని చేసే ఫ్యాక్టరీలోనే కార్పెంటరు — రాజు. ముప్ఫై దాటి ఉంటాయి. చెక్కల కొలతలకి తగినంత చదువే. హైదరాబాద్‌లో ఆర్నెల్ల పాటు తిరిగి ఆ ఉద్యోగం సంపాదించుకున్నాడు. వెంటనే తల్లినీ భార్యనీ పిల్చుకొచ్చి బంధువుల ఇంట్లో పెట్టాడు, మర్నాడు అద్దె ఇల్లు దొరకదా అని! చూస్తూ వుండగా నెలదాటిపోయింది. ఇంటికోసం వెతుకుతూనే వున్నాడు. తెలిసిన వాళ్ళందరికీ ఇంటిగోడు చెప్పు కున్నాడు. చిన్న అద్దెలో ఒక గూడు కావాలని మొం పెట్టాడు. రాజుకోసం సత్యం కూడా తెలిసిన వాళ్ళతో చెప్పాడు.

రాజు కంటబడితే చాలు, "ఇల్లు దొరికిందా?" అనడమే అతనితో మొదటి పలకరింపు! "లేదుసార్!" అని రాజు ఏడుపు మొహం పెడుతూ వుంటాడు.

రాజు మొహం చూస్తే చాలు, ఒకప్పుడు తను ఇంటికోసం పడ్డ పాట్లన్నీ గుర్తొస్తాయి సత్యానికి.

ఆ రోజు సత్యం చూసేటప్పటికి, రాజు నవ్వుతూ

తుళ్ళుతూ మాట్లాడేస్తున్నాడు ఎవరితోటో! మొహం సంతోషంతో వెలిగిపోతోంది.

'ఇల్లు దొరికిన మొహంలా ఉందే!' అనుకుంటూ ఉండగానే రాజు పరిగెత్తు కొచ్చి "ఇల్లు దొరికింది సార్! అక్కడికి మారిపోయాం" అన్నాడు నవ్వుతూ.

సత్యానికి కూడా పెద్ద బరువు దిగి పోయినట్టని పించింది. "దొరికిందా?" అని అరిచాడు.

"దొరికింది సార్, మీ దయవల్ల!"

"భలేవాడివి" అని నవ్వాడు సత్యం. "అంతా సదుపాయంగా ఉందా?"

"ఉందిసార్! బాత్‌రూమూ అదీ అన్నీ ఉన్నాయి సార్! ... మేడమీద వాటా సార్!"

"అబ్బబ్బా! నా పేరు 'సార్' కాదు, సత్యం! పేరుతో పిలవమని ఎన్నిసార్లు చెప్పాను!"

"అలా అనకండి సార్!"

"సరే నెమ్మదిగానే నేర్చుకో, 'సార్' వదిలెయ్యి! మొత్తానికి మీకు ఇల్లు దొరికింది! అదే చాలు బాబూ!"

"ఎప్పుడన్నా అటువేపొస్తే మా ఇంటికి రండి సార్!"

"'అటువేపొస్తే' ఏమిటి? అదే పని పెట్టుకుని వస్తాను. మీ ఇల్లు చూడాలని ఎంతో తొందరగా ఉంది నాకు" అని సత్యం ఆ దారులన్నీ రాసుకున్నాడు.

అరే! శర్మ కూతురు ఉండే ఆఫీసర్స్ కాలనీ కూడా అటువేపే! చాలా దగ్గిర అక్కడికి!

శర్మ కూతురు దగ్గిరికి వెళ్ళకూడదని నిర్ణయించు కున్న దగ్గిర్నించీ సత్యాన్ని ఇంకో ఆలోచన సతాయి స్తోంది. అమెరికాలో ఇంజనీరుగా ఉన్న కొడుకూ, క్లాస్ వన్ ఆఫీసరు గారి భార్యగారైన కూతురూ ఉండగా, శర్మ, అంత కుళ్ళు గుడ్డలతో, అంత జ్వరంలో ఒంట రిగా రైలెక్కడం ఏమిటి? ఆ రహస్యం కనిపెట్టాలంటే, శర్మ కూతురి ఇంటికి వెళ్తేనే 'క్లూ' దొరకవొచ్చు కదా — అనిపిస్తోంది అప్పుడప్పుడూ.

కానీ, 'ఎవరి కూతుళ్ళూ, కొడుకులూ ఎలా ఏడిశారో ఎన్ని కొంపలు తిరిగి చూస్తాం? కొత్తగా కని పెట్టేదేముంటుంది? అంతా తెలిసిన భాగోతమే' అని సత్యం తన కుతూహలాన్ని ఎగరగొట్టుకుంటూనే ఉన్నాడు, అది తలెత్తినప్పుడల్లా!

★ ★ ★

రాజు ఇంటిని కనిపెట్టడం మరీ కష్టం కాలేదు. 'వీకర్ సెక్షన్స్ క్వార్టర్స్' అవి! 'మేడ మీద' అని, రాజు వివరాలన్నీ సరిగానే చెప్పాడు.

సత్యం తిన్నగా మెట్లమీద నుంచీపైకి బైల్దేరాడు. మెట్లు సుఖంగా లేవు. నిటారుగా నిచ్చెన ఎక్కు తున్నట్టు వున్నాయి. మెట్టు మీద పాదం అంతా మోపడం వీలుకాలేదు. పాదాలు పక్కకి తిప్పి ఎక్కాల్సి వచ్చింది.

తలుపులు వోరగా వేసివున్నాయి. రాజు కంఠం వినపడుతోంది.

"రాజూ!" అని పిలిచాడు సత్యం.

తలుపు తెరిచాడు రాజు. సత్యాన్ని చూసి ఆశ్చర్య పడ్డాడు "మీరా సార్? రండి సార్! రండి సార్!" అంటూ మీదబడి కావిలించుకున్నంత పనిచేశాడు.

సత్యం గది లోపలికి అడుగుపెట్టి ఇటూ అటూ చూశాడు. మంచంమీద రాజు తల్లి!

"కూర్చోండి సార్! ఇక్కడ కూర్చోండి సార్!" అంటూ రాజు తలుపు పక్కన చూపించాడు. వెలిసి పోయి, ఒక కాలు వొంగిపోయి ఉన్న రేకుకుర్చీ అది. చుట్టూ చూస్తూ దానిమీద జాగ్రత్తగా కూర్చున్నాడు. సత్యం. 'ఎటువేపన్నా ఇంకోగది వుందా' అని గోడల్లో తలుపుల కోసం వెతికాడు. ఆశ్చర్యం! ఎటూ ఇంకేమీ లేదు! అంతా కలిసి ఆ గదే! మెట్ల మీదనించి వచ్చిందే దారి! అంతే!

అయిపోయింది ఇల్లు చూడ్డం! చూడ్డానికి ఇంకేమీ లేదు! ఒకే ఒక్కచూపు చాలు!

సత్యం, గదిలోపలే తనిఖీలు మొదలు పెట్టాడు. కళ్ళతో వేసిన అంచనాలు ఎంత తప్పు అయినా, ఆ గది కొలతలు, ఒక వేపు 9 అడుగులూ, ఇంకోవేపు 8 అడుగులూ దాటవు. అంటే, మొత్తం గది వైశాల్యం $9 \times 8 = 72$ చదరపు అడుగులు. అంటే, 8 చదరపు గజాలు! అందులోనే ఒక మూల రేకు తలుపుతో బాత్‌రూము వుంది. దాని ముందు చిన్న నీళ్ళతొట్టి. మెట్ల మీదనించి నీళ్ళుతెచ్చి అందులో పోసుకోవాలి! గదిలో ఇంకో మూల స్టవ్వు పెట్టుకునే సన్నని గట్టు. దానికింద, గిన్నెలు పెట్టుకునే రెండు గూళ్ళు. బాత్ రూము ముందు తల్లి పడుకున్న నులక మంచం. దానిపక్క చిన్న కిటికీ! నాలుగో మూలలో, గదిలోకి

వచ్చే గుమ్మం. ఆ గుమ్మం ముందే చిన్న చాప పట్టేంత చోటు. ఆ చోటులోనే ఒక పక్కగా గోడ దగ్గర చిన్న బల్ల. దాని మీద లేసుగుడ్డ! దాని మీద చిన్న అద్దం ముక్కా, దువ్వెనా, చిన్న రేడియో, బల్ల కింద పక్క బట్టలు. తల్లి మంచం కింద రెండు రేకు పెట్టెలూ, చాపా. అదీ సామాను!

ఆ భార్యా భర్తలు, ఆ ముసలావిడ మంచం పక్కన, గుమ్మం ముందు, చాప వేసుకుని పడు కుంటారు కాబోలు! 'కాబోలే'మిటి? అంతకన్నా వేరే చోటులేదు!.

గదిలోకి వచ్చి నప్పటి నించీ ఒకటే రొచ్చు వాసన! బాత్‌రూమ్‌లోకి వెళ్ళిన వాళ్ళు నీళ్ళు సరిగా పోసినట్టు లేరు. పొయ్యడానికి నీళ్ళెక్కడున్నాయి తొట్లో?

ఇదేమిటి? ఇదేం ఇల్లు? ఇంత ఘోరం!

సత్యానికి వర్కర్స్ ఇళ్ళు చాలా తెలుసు. మురికి వాడల్లో గుడిసెలు కూడా తెలుసు. అవన్నీ నేలమీద వుంటాయి. గుడిసెల ముందు ఇటూ అటూ తిరగ డానికి వీలుంటుంది. ఇంత వరకూ ఇలాంటి ఇల్లు చూడలేదు. సజీవ సమాధుల్లోలాగ ఎక్కడి వాళ్ళక్కడే నిలబడి వుండాలి. రెండో అడుగు వెయ్యడం ఎక్కడ?

సత్యం గదిలోకి వచ్చినప్పటి నించీ మంచం మీద పడుకున్న ఆవిడ లేచే ప్రయత్నం చేస్తోంది. కొడుకు వారించాడు.

"మీ అమ్మగారే కదా? ఆరోగ్యం బాగా లేదా?" అన్నాడు సత్యం.

"ఇప్పుడు బాగానే వుందిసార్! ఏడాది క్రితం పక్షవాతం వచ్చింది. ఎడం కాలూ చెయ్యీసరిగా లేవండీ" అన్నాడు రాజు.

"అలాగా? ఎప్పుడూ చెప్పలేదేం?" అన్నాడు సత్యం.

"చెప్పలేదండీ" అని ఊరుకున్నాడు రాజు.

సత్యం, ఆవిణ్ణి పలకరించి చాలా అడిగాడు. అన్నిటికీ జవాబులు చెప్పింది. కానీ, మాట ముద్ద ముద్దగా వొస్తోంది. అంతా విన్నాక సరైన సమయంలో వైద్యం దొరక్క అలా అయిందని అర్థం చేసుకున్నాడు సత్యం. ఇప్పటికైనా వైద్యం దొరికితే, ఆవిడ లేచి తిరగ్గలదు. కానీ, 'వైద్యం దొరికితే'! లేస్తే, 'తిరగడం' ఎక్కడ?

రాజు భార్య కిరసనాయిలు స్టవ్వు అంటించింది. స్టవ్వు మండుతోంటే, కిరసనాయిలు వాసనకి, గదిలో రొచ్చువాసన కొంత తగ్గింది.

పేరు అడిగితే "సత్యవతండీ" అని చెప్పింది.

"మీ పేరేనండీ" అని నవ్వాడు రాజు.

సత్యవతి చాలా నిరుత్సాహంగా వున్నట్టు కన పడింది.

"పిల్లలు లేరుకదూ?" అన్నాడు సత్యం.

"లేరండీ" అని సిగ్గుపడ్డాడు రాజు.

పేదవాళ్ళకి కూడా నిష్కారణంగా కొన్ని 'అదృ ష్టాలు' పడుతూ వుంటాయి.

ఆ ఇంట్లో వాళ్ళ అదృష్టం అంతా పిల్లలు లేక పోడం! ఆ ఇంట్లో ఉన్నంతకాలం ఇక పిల్లలు వుండకపోడం!

ఒక పిల్ల ఉంటే ఏమవుతుంది ఈ ఇంట్లో? ముసలి తల్లేగాక, తండ్రి కూడా వుంటే? ఇక వాళ్ళం దరూ మెట్ల మీదేనా?

ఈ ఇల్లు దొరికినందుకు ఎంత పొంగిపోతున్నాడో రాజు! అతని భార్యకి అలా ఉన్నట్టు లేదు.

సత్యవతి కొంచెం సిగ్గుపడుతూ మౌనంగా టీ గ్లాసు అందించింది సత్యానికి.

"తీసుకోండి సార్" అన్నాడు రాజు.

సత్యం నవ్వుతూ గ్లాసు అందుకున్నాడు.

"మా ఆవిడికి ఈ ఊరు నచ్చలేదు సార్! మన వూరే వెళ్ళిపోదాం అనిరోజూ గొడవే" అని ఫిర్యాదు చేశాడు రాజు.

"ఊరు కాదు, ఇల్లు నచ్చలేదేమో! అంతేనాండీ?" అని సత్యం నవ్వుతూ సత్యవతిని పలకరించాడు.

ఆ అమ్మాయి ఆశ్చర్యపోతూ చూసింది.

"మీ ఊళ్ళో మీకు ఇల్లు వుందా?" అన్నాడు మళ్ళీ సత్యం, ఆమెతో.

సత్యవతి గబగబా చెప్పింది "తాటాకుల పాక వుందండీ. రొండు గదులూ, వసారా, ఉంటాయి. వాకిట్లో తిరుగుతూ ఈ పనీ ఆ పనీ చేసుకోవొచ్చు. బట్టలు ఆరేసుకోవొచ్చు బైట. ఇక్కడేం ఉందండీ? మా అత్తమ్మ రొండడుగు లెయ్యాలంటే వల్ల కాదు .... ఇదేం ఇల్లండీ ఇలా కట్టారు? మనుషులెలాగుంటా రండీ ఇంత ఇరుగ్గా?"

ఏం జవాబు వుంటుంది? 'వీకర్ సెక్షన్సు' అంటే మనుషులని, అప్పర్ సెక్షన్స్ అనుకుంటే కదా?

"అవును, ఇక్కడ చాలా ఇబ్బందే, ఎన్నాళ్ళో ఉండలేరు ఇందులో, ఇంకో ఇల్లు చూసుకుని మారిపోవలిసిందే!" అన్నాడు సత్యం.

"ఇంకో ఇల్లా? భలే చెప్పారు సార్" అని నవ్వాడు రాజు.

సత్యవతి మళ్ళీ అంది "నేనుకూడా అలాగే అంటున్నానండీ. గుడిసె అయినా సరే, మారిపోదాం అంటున్నానండీ. లేకపోతే వెళ్ళిపోదాం అంటున్నా నండీ."

"వెళ్తే అక్కడేం తింటాం, మీరే చెప్పండి సార్?" అన్నాడు రాజు.

"వెళ్ళడం సంగతి తర్వాత గానీ, రాజూ! ముందు నువ్వు ఇంకో ఇల్లు చూడు! వెతకడం మానకు!" అన్నాడు సత్యం.

వాళ్ళకి ఇంకో ఇల్లు నిజంగా దొరికితే, అది మాత్రం రెండు గదులు వుంటుందా? ఈ నరకంలోకి ఇంకో కుటుంబం అయినా రావలిసిందే కదా?

అరగంటసేపు కూర్చుని లేచాడు సత్యం. అంతసేపూ సత్యవతితో "ఇంకో ఇల్లు దొరక్కపోదు" అని అతిశయాలతో ధైర్యం చెప్పాడు.

సత్యం, రాజు తల్లితో కూడా "నాకు తెలిసిన డాక్టరు గారొకరు వున్నారు. ఆయనతో మాట్లాడి రాజుకి చెపుతాను. పర్వా లేదండీ. మీకు తగ్గుతుంది" అని మరీ మరీ చెప్పాడు.

ఆవిడ కళ్ళనీళ్ళతో దణ్ణంపెట్టడానికి ప్రయత్నిం చిందిగానీ ఒక చెయ్యి కలిసి రాలేదు.

"వొద్దొద్దు! అలా చెయ్యకండి!" అని సత్యం వారించాడు.

సత్యంతోపాటు రాజు కూడా రోడ్డు మీద చాలా దూరం దాకా మాట్లాడుతూ వచ్చాడు.

"రాజూ! ఇంటి కోసం వెతికే పని మానకు సుమా! ఆర్నెల్లకన్నా బయట పడాలి ఇందులోనించి".

రాజు ఊరుకున్నాడు.

"రాజూ! మీ అమ్మని చూసినప్పటినించీ ఒక సంగతి ఆలోచిస్తున్నాను. భద్రం గారనీ, నాకు తెలిసిన ఒకాయన పెద్దవాళ్ళ కోసం శరణాలయం లాంటిది పెట్టారు. ఆయనతో మాట్లాడి చూస్తాను. ఇవ్వలేని వాళ్ళ దగ్గిర డబ్బులు తీసుకోరనుకుంటాను. అమ్మని కొన్నాళ్ళు అక్కడపెడితే బాగుంటుంది."

రాజు నిర్ఘాంతపోతూ చూశాడు.

"అక్కడ వైద్యంకూడా చేయిస్తారు. అమ్మకి అక్కడే బాగుంటుంది. లేకపోతే ఇంత ఇరుకు కొంపలో ముగ్గురూ ఎలా వుంటారు?"

"వొద్దుసార్! వొద్దుసార్!" అని రాజు ఆ ఆలోచనే భరించలేనట్టు తల గిరగిర తిప్పేశాడు "వొద్దుసార్! మేం ఎక్కడ వుంటే అమ్మ అక్కడే వుంటుంది. అమ్మని ఎక్కడో పెట్టడం వొద్దుసార్!" అప్పటికే రాజు కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

సత్యం, సంభ్రముగా చూశాడు రాజుని. కొంచెం నవ్వి — "అది కాదు రాజూ! కొన్నాళ్ళు వైద్యం జరిగితే బాగుపడొచ్చు కదా?" అన్నాడు.

"దీనికి వైద్యం వుండదు సార్! చాలా మంది చెప్పారు."

"అలా అనకు. డాక్టర్ని నేనడిగి చూస్తాగా?"

"ఏమన్నా మందులు వుంటే ఇంట్లోనే వాడదాం సార్! ఈ జబ్బుకి ఇంట్లో సొంత మనుషులు చూసు కుంటేగానీ కుదరదు సార్! రోజూ నీళ్ళుపోసి చీర కట్టాలి, అన్నం కలిపిపెట్టాలి. కాళ్ళకి మర్దనాలు చెయ్యాలి. సాయంపట్టి దొడ్లోకి తీసికెళ్ళాలి. అవన్నీ సొంత వాళ్ళు చెయ్యాలిగానీ, మేము వొదిలేస్తే పరాయి వాళ్ళెందుకు చెయ్యాలి సార్?"

"అది కాదు రాజూ."

"వొద్దుసార్! నాకో, సత్యవతికో ఇలాంటి జబ్బు వొస్తే మా అమ్మ మమ్మల్ని వొదిలేస్తుందా సార్? అలాంటి పని చేశానంటే నాకు కంటిమీద కునుకు పడుతుందా సార్?" రాజు ఏడుపు కంఠంతో అన్నాడు చివరి మాటలు.

సత్యానికి కళ్ళలో నీళ్ళు తిరిగినంత పనైంది. వెంటనే మాట్లాడలేకపోయాడు. రాజు చెయ్యి పట్టు కుని గట్టిగా నొక్కాడు.

ఎంత చెప్పినా రాజు అదే మాట! "మందులు వుంటే ఇమ్మనండి సార్, డబ్బులు ఇచ్చేద్దాం. ఇంట్లోనే వాడదాం. సత్యవతి అమ్మని ప్రాణంగా చూసు కుంటోంది. అమ్మని ఎక్కడన్నా పెట్టాలంటే సత్యవతి

అసలే ఒప్పుకోదు. ఇప్పుడే వెళ్ళిపోదాం అంటుంది" అన్నాడు. రెండు మూడు సార్లు కళ్ళు కూడా తుడుచు కున్నాడు.

రాజుని చాలా ప్రేమగా చూశాడు సత్యం. "సరే, ఇక నువ్వు వెళ్ళు! ఆ మెట్ల మీద నీళ్ళు తెచ్చేటప్పుడు చాలా జాగ్రత్త సుమా! ఇంటి సంగతి మర్చిపోకు సుమా! నేను డాక్టరుతో మాట్లాడి చూస్తాలే, ఇక నువ్వు వెళ్ళు!"

రాజు ఆగాడు "ఉంటా సార్!"

సత్యం నవ్వి ముందుకు సాగాడు.

ఆ గది కళ్ళల్లో మెదులుతూ కడుపులో ఇంకా వికారపెడుతూనే వుంది. కానీ, ఆ మనుషులు! ఆ రాజు! తల్లిని ప్రేమించే ఆ కొడుకు! మనసంతా సంతోషంతో నిండి పోయినట్టుగా వుంది!

పావుగంట నడకతో కళ్ళ ముందు దృశ్యం మారి పోయింది! ఎటుచూస్తే అటు విశాలమైన పేవ్ మెంట్లు! కాంపౌండులు! చుట్టూ ఎటుచూస్తే అటు పచ్చగా గుబురుగా చెట్లే చెట్లు!

అదే ఆఫీసర్స్ కాలనీ!.... చప్పున శర్మ కూతురు మాట గుర్తొచ్చింది. చూద్దామా పోనీ? తండ్రి గురించి ఏం మాట్లాడుతుందో విందాం. వీలైతే కొంచెం గడ్డి కూడా పెట్టొచ్చు! 'ఫ్లాస్కులో కాసిన్ని పాలైనా ఇవ్వ కుండా ఎలా పంపావు శర్మ కూతురా?' — అని అడగొచ్చు.

సత్యానికి ఉత్సాహం ఉరకలు వేసింది. జేబు లోంచి ఫోను నెంబర్ల పుస్తకం తీశాడు. ఆశ్చర్యం! శర్మ ఇచ్చిన నంబరు దొరికింది.

పది అడుగులు వేసేటప్పటికి ఫోన్ బూత్ కన పడింది. చేశాడు ఫోను.

ఆవిడే ఎత్తింది ఫోను. "మీరా? రండి! రండి! రండి!" అంది డజన్‌సార్లు.

మంచి ఆహ్వానమే! ప్రారంభం బాగానే వుంది!

ఆ ఇల్లు తేలిగ్గానే దొరికింది. దూరం నించే ముళ్ళ తీగల ఫెన్సింగ్‌తో విశాలంగా ఆవరణ కనపడింది. ఫెన్సింగ్ నిండా తీగలు అల్లుకుపోయి, వాటి నిండా తెల్లనీ పచ్చనీ పూలు! ఆవరణ ముందు పేవ్‌మెంటు కనీసం పదిహేను అడుగుల వెడల్పు వుంటుంది. పేవ్‌మెంటు మీద ఎర్రటి తురాయి పూల చెట్లు! గేటుకి దగ్గర్లో రెండు వేపులా వేపచెట్ల బోడి కొమ్మలకి క్రోటన్ మొక్కల కుండీలు వేళ్ళాడుతున్నాయి. పచ్చటి వేపచెట్ల కొమ్మల్ని చెక్కేసి, క్రోటన్ మొక్కలు వేళ్ళాడ దీశారు. ఏం మనుషులు అనుకోవాలి!

ఆవరణలో తోటమాలి కావచ్చు .... పేంటూ బనీనూ వేసుకున్న దాదాపు పద్దె నిమిదేళ్ళ కుర్రాడు పూలమొక్కల్లో తవ్వకం పని చేస్తున్నాడు.

సత్యం, గేటు తీసుకుని లోపలికి వెళ్ళి గేటు మూశాడు. మొక్కల్లో కుర్రాణ్ణి చూస్తూ "వసంతగార్ని పిలుస్తావా?" అని అడిగాడు.

"సత్యంగారాండీ మీరు?"

"అవును, ఇప్పుడే ఫోను చేశాను."

"అమ్మగారు చెప్పారండీ, మీరు రాగానే చెప్ప మన్నారండీ" అనేసి, కుర్రాడు లోపలికి వెళ్ళాడు.

సత్యం, గేటు దగ్గిర నిలబడి ఆవరణ అంతా చూశాడు. అంచనా ఎంత తప్పినా ఆ ఇంటి స్థలం కనీసం పన్నెండు వందల గజాలకన్నా పైనేగానీ తక్కువ వుండదు. గేటు దగ్గిర్నించీ ఇంటి ముందు వరండా దాకా కనీసం నలభై అడుగుల దూరం వుంటుంది. ఇక వెనకాల ఎంత వుందో తెలీదు! ఆవరణనిండా పూలమొక్కల్నీ చెట్లనీ పచ్చికల్నీ చూడ్డా నికి రెండు కళ్ళూ చాలవు. ఆ మొక్కల్లో తిరుగుతూ పని చెయ్యడం అంటే, అంతకన్నా హాయి అయిన పని వుండదు.

"రండి సత్యంగారూ! అక్కడే నిలబడ్డారేవిటి? లోపలికి రండి!" అంటూ ఒకావిడ హడావుడిగా వొస్తూ కంగారుగా పిలిచింది.

సత్యం మెట్లెక్కి వరండా మీదకి వెళ్ళాడు. అక్కడ నాలుగైదు పేముకుర్చీలు వున్నాయి.

"ఇక్కడ కాదు, లోపలికి రండి! లోపల కూర్చుందాం రండి!" - ఎంత మర్యాదగానో!

వసంతకి ముప్పై ఐదేళ్ళు వుంటాయేమో! తళతళ మెరిసిపోతున్న ఆకుపచ్చ సిల్కు నైట్ గౌనులాంటిది వేసుకుంది. లేకపోతే అది పట్టపగలు గౌనేనేమో! చెమ్కీ చారలతో మెరుస్తోన్న తెల్లటి ఉల్లిపొరలాంటి బట్ట భుజాల చుట్టూ కప్పుకుంది. పెద్ద జుట్టుముడి!

వసంత వెనకాలే వరండాలోనించి లోపలికి వెళ్తే అదో పెద్ద హాలు! 20 × 20 వుండొచ్చు. ఒక్కచూపుతో

అనేక దృశ్యాలు కంటపడ్డాయి. తళతళలాడే మచ్చల కవర్ల సోఫాలూ కుర్చీలూ, దూరదూరంగా రెండు చోట్ల కొలువుదీరి వున్నాయి. దూరంగా వున్న సోఫాలో ఒక అబ్బాయి అటు తిరిగి కూర్చుని టీవీ చూస్తున్నాడు.

హాలులోంచి ఇతర గదుల్లోకి వెళ్ళడానికి ఐదు గుమ్మాలు వున్నాయి. అన్ని గుమ్మాలకీ తెరలు వేళ్ళాడుతున్నాయి. హాలుకి రెండు పక్కలా పెద్ద పెద్ద కిటికీలు తెరిచి వున్నాయి. కిటికీలలోనించి ఆవరణలో చెట్లు కనపడుతున్నాయి. గోడల మీద విశాలంగా ప్రకృతి దృశ్యాలు! కొండలూ కోనలూ, నీళ్ళ మీద సూర్య బింబం, వేపచెట్ల మీద కాకిగూళ్ళూ — అన్నీ హాలులోనే!

అన్నిటి కన్నా పెద్ద చిత్రంలో — నదిలో పడవ నడుపుతున్న వృద్ధుడు!

హాలులో ఒక పక్కగా పైకి మెట్లు!

అంతా స్టీరియో టైపు డెకరేషన్! డబ్బున్న వాళ్ళ ఇళ్ళల్లో ఏ ఇంట్లో నిలబడి చూసినా, అదే రకం సోఫాలూ, అదే రకం కర్టెన్లూ, అదే రకం చిత్రపటాలూ, అంతా అదే రకం అలంకరణలు! 'డబ్బు' అంతా ఒకే రకం కదా!

సత్యం పడవ నడిపే వృద్ధుడి పటంవేపే చూస్తూ "మీకు పెద్దవారంటే చాలా గౌరవం అనుకుంటాను" అన్నాడు.

వసంత మొహం మెరిసిపోయింది. ముక్కుపుడక కూడా తళతళలాడింది. "అవునండీ, నాకు చాలా ఇష్టం! ఈ పటం నేను చాలా పట్టుబట్టి ఎగ్జిబిషన్‌లో కొన్నాను ..."

సత్యం హాలు అంతా పరికిస్తూ, "కూర్చోండి" అనక ముందే ఒక పేము కుర్చీలో కూర్చున్నాడు.

"అక్కడ కూర్చున్నారేమిటి? ఇలా సోఫాలో కూర్చోండి!"

"ఫర్వాలేదు. ఇది బాగుంది."

వసంత కూడా ఇంకో పేము కుర్చీ దగ్గిరికి జరుపుకుని కూర్చుంది. "నాన్నగారి దగ్గిర్నించీ నిన్నే వచ్చిందండీ ఉత్తరం! దాన్నిండా మీ గురించే రాశారు. ఎంత ఆశ్చర్యపడ్డానో! తెస్తానుండండి!" అంటూ లేచింది.

"అక్కర్లేదు. ఉత్తరం ఎందుకు? ఆయన బాగున్నారా?"

"కాదు, మీరు చూడాలి" అంటూ వసంత గబగబా లోపలికి వెళ్ళింది. ఆమె వెళ్తోంటే, కాళ్ళకి పట్టాలు వున్నట్టుగా గజ్జెల శబ్దం వినిపించింది.

ఉత్తరం తెచ్చి నవ్వుతూ అందించింది.

"మీరు చెప్పండి, చాలు."

"కాదు, మీరు చూడాలి తప్పకుండా."

సత్యం ఉత్తరం తెరిచి మొదట కొంచెం చదివి తర్వాత అక్కడక్కడా చూశాడు. రైల్లో సంగతంతా జరిగింది జరిగినట్టే రాశాడు శర్మ.

"ఆయన లేకపోతే ఆ రోజు నేనేమైపోయే వాడినో భగవంతుడికే తెలియాలి. తల్చుకుంటోంటే ఇప్పటికీ నమ్మశక్యం కాకుండా వుంది. అంతా స్వామీజీ దయ! సత్యంగారు లేకపోతే ...." చెప్పిందే చెప్పి, రాసిందే రాసి, ఉత్తరం అంతా నింపాడు.

ఆ ఉత్తరం చదివి కూతురు బాగానే గాభరా పడినట్టుంది. అందుకే తనకి అంత శ్రద్ధగా ఆహ్వానం పలికింది.

"అన్నయ్య వుంటే కూడా అలా చేసే వాడు కాడు. కన్నకొడుకు కన్నా ఎక్కువగా చేశాడు ఆయన — అని రాశారు, చూశారా?" అంది వసంత నవ్వుతూ.

సత్యం కూడా నవ్వి, ఉత్తరం పక్కన పెట్టేశాడు.

"ఈ ఉత్తరం మా అన్నయ్యకి నిన్న ఫోనులో చదివి వినిపించానండీ! చాలా బాధపడ్డాడు. 'రెండు రోజులు ఆగండి నాన్నా' అంటే వినకుండా బైల్దేరారండీ ఆ రోజు."

ఆ కుళ్ళు గుడ్డల సంగతి ఎప్పుడు ఎత్తుదామా — అని సత్యానికి తొందరగా వుంది. అసలు వొచ్చిందే అందుకు!

"ఆయన బట్టలన్నీ చాలా మాసిపోయి వున్నాయి. లుంగీలు మార్చాలంటే ఒక్కటి కూడా వుతికింది దొరకలేదు. పెట్టినిండా కూడా అన్నీ విడిచిన బట్టలే!" అని సత్యం ఆశ్చర్యపోతూ అన్నాడు.

వసంత కొంచెం తలవొంచి "పెట్లో విడిచిన బట్టలా? లేదండీ. అన్నీ వుతికించి ఇచ్చానే!.... అప్పుడు నాకు నాలుగు రోజులు బాగా లేదండీ! లేవలేదు. ఇంట్లో ఇంకెవ్వరూ లేరు. లేచాక అన్నీ ఉతికించి సర్దుదామనుకుంటూ వుంటే, నాన్నగారు హఠాత్తుగా బైల్దేరారు.... అవునండీ.... గుర్తొచ్చింది.... సంచిలో

విడిచిన బట్టలే పెట్టుకున్నారు" అంది.

"సంచిలోనే కాదు, పెట్లో కూడా" అన్నాడు సత్యం మళ్ళీ.

వసంత మాట్లాడలేదు.

"మీ అన్నయ్యెంత కాలమైంది వెళ్ళి? ఇక అక్కడ వుండి పోయేదేనా?"

వసంత నవ్వింది "అంతేకదండీ? అమెరికా వెళ్ళిన వాళ్ళు తిరిగి వొస్తారా? అక్కడ ఇల్లు కూడా కట్టుకున్నాడు. పదేళ్ళు అయింది వెళ్ళి. రెండు మూడేళ్ళకోసారి వొచ్చి వెళ్తున్నాడు."

"అయితే ఇక నాన్న బాధ్యత మీదే."

"అంతేనండీ!"

టీవీలో ఖయ్యిఖయ్యిమంటూ ఏదో పాట ప్రారంభమైంది.

సత్యం ఉలిక్కిపడి అటు చూశాడు. మొలలకీ గుండెలకీ రిబ్బన్నులు మాత్రమే చుట్టుకున్న నలుగు రైదుగురు ఆడవాళ్ళు, జుట్లు విరబోసుకుని, కాళ్ళూ చేతులూ విసిరేస్తూ, జాతరలో పూనకం గంతుల్లాంటి గంతులతో తెరమీద కనపడ్డారు. కాలిమీద బూటు కాలు పడ్డప్పుడు వేసే కేకల్లాంటి కేకలతో పాట సాగుతోంది.

టీవీ చూస్తున్న కుర్రాడికి పదిహేనేళ్ళు వుంటా యేమో! తొడలు కనిపించే పొట్టి నిక్కరూ, గుండెల మీద పిస్తోలు బొమ్మవున్న టీషర్టూ వేసుకున్నాడు. ప్లేటులో ఏదో తింటున్నాడు. సత్యం అంచనా తప్పు కాకపోతే, ఆ కుర్రాడు ఖచ్చితంగా 65 కిలోల బరువు తూగుతాడు.

"అరేయ్ శేఖర్!.... మంచినీళ్ళు!" అని అరిచాడా 65 కిలోల కుర్రాడు.

వసంత కొంచెం కంఠం పెంచినా, నాజూకుగానే "శేఖర్! బాబుకి మంచినీళ్ళివ్వ లేదూ?" అని ఇక్కణ్ణించే శేఖర్ని పిలిచింది.

లోపల్నించి ట్రేలో మంచినీళ్ళ గ్లాసులు పెట్టు కుని ఆ శేఖరు ఒక గుమ్మంలోనించి వచ్చాడు. వాడికి పది దాటి వుంటాయి. లూజు నిక్కరూ, ఇంకా లూజు టీషర్టూ వేసుకున్నాడు.

"మీ అబ్బాయా?" అన్నాడు సత్యం సోఫాలో పిల్లవాడిని గురించి.

"అవునండీ! ఇతను పెద్దవాడు. పేరు ముఖేష్! చిన్నాయన సతీష్! ఎక్కడికో వెళ్ళినట్టున్నాడు.... ముఖే! సతీ ఎక్కడికి వెళ్ళాడు?" అని వసంత కొడు కుని ఇంగ్లీషులో అడిగింది.

"తెలీదు మమ్మీ!" అని అతను తల తిప్పకుండా ఇంగ్లీషులోనే చెప్పాడు.

"వాడికి ఫ్రెండ్స్ ఎక్కువండీ! ఎప్పుడూ తిరుగుతూ వుంటాడు. ఇతనికంతా మ్యూజిక్ ఇంటరెస్ట్. ఇతని పేరు నాన్నగారే పెట్టారు. ఆయనకి ముఖేష్ పాటలు చాలా ఇష్టం."

టీవీలో దృశ్యం మారింది. చేతి రుమాళ్ళతో గోచీలు పెట్టుకున్న ఓ గుంపుడు మంది ఆడవాళ్ళూ మొగవాళ్ళూ ఎగురుకుంటూ వచ్చి పడ్డారు. కీచూ బొంగురూ కంఠాలతో డొక్కల్లో శూలపోట్లు కెలక వేస్తున్నట్టు పాట ఎత్తుకున్నారు.

ముఖేషు, చేతిలో రీమోట్‌తో సౌండ్ పెంచాడు.

"వొద్దు ముఖే! మేం మాట్లాడుకుంటున్నాం" అంది తల్లి.

"లేదు మమ్మీ! ఇలాంటి సాంగ్స్ హైసౌండ్‌తోనే వినాలి. విని చూడు!" అన్నాడు కొడుకు.

తల్లి ఏమీ అనలేదు. నవ్వింది. ఏ పాటని ఎలాంటి సౌండ్‌తో వినాలో అంత చిన్న వయసులోనే గ్రహించగలుగుతోన్న కుమారుడి సంగీత జ్ఞానానికి ముగ్ధురాలైనట్టు సంతోషించింది.

ఖాళీ మంచి నీళ్ళగ్లాసు చేత్తో పట్టుకుని నోరు తెరిచి టీవీ చూస్తూ నిలబడి పోయిన శేఖర్‌తో వసంత — "శేఖర్! చిన్నబాబు వొచ్చేస్తాడు. జ్యూస్ తీశావా?" అంది.

శేఖర్ కొంచెం జంకి లోపలికి వెళ్ళిపోయాడు.

ఇక లేస్తే మంచిదనిపించింది, సత్యానికి. "మీ నాన్నగారికి ఆ రోజున బైల్దేరేప్పుడే 102 జ్వరం వుందట! అలాంటి పరిస్తితిలో మీరసలు వెళ్ళనివ్వ కుండా ఉండాల్సింది" అన్నాడు.

"లేదండీ! అంత జ్వరం లేదండీ! కొంచెం డల్‌గా అనిపించారు. అంతే."

"ఆయనే చెప్పారు, అంత జ్వరం వుందని."

"చెప్పారా? నాతో అనలేదండీ. ఇంకో రెండు రోజులు ఆగి వెళ్తే బాగుండేదిగానీ, ప్రతీ ఫస్టుకీ

ఆయన అక్కడ కొంచెం ఫైనాన్స్ విషయాలు చూసు కుంటారండీ! అందుకే తొందరపడి వెళ్ళారు."

ఫైనాన్స్ విషయాలు! అంటే వడ్డీ వ్యాపారమేగా? ముఖేష్‌ని ఇష్టపడే వాళ్ళు వడ్డీ వ్యాపారం చేస్తారా? లేకపోతే, రెండూ వేరు వేరా?

"మీరేదైనా ఉద్యోగం చేస్తున్నారా?" అన్నాడు సత్యం.

వసంత నవ్వింది — "ఉద్యోగం ఉన్న వాళ్ళకి ఒక్కటే పని. లేని వాళ్ళకే లక్ష పనులు! సోషల్ వర్క్ అంటే నాకు చాలా ఇష్టమండీ! ఆఫీసర్స్ భార్య లందరికీ ఒక క్లబ్బు వుంది. సోషల్ వర్క్ మీదే చాలా చోట్లకి తిరుగుతూ వుంటాం!"

సత్యం, ఆ సంఘసేవా వివరాలేవీ అడగదల్చు కోలేదు.

"శేఖర్! రంగమ్మని అడిగి అయ్యగారికి కాఫీ తీసుకురా!" అని అరిచింది వసంత

"నాకా! నా కోసం అయితే వొద్దు! ఇప్పుడే ఒక ఫ్రెండ్ ఇంట్లో టీ తాగి వొస్తున్నాను."

"మేం కూడా మీ ఫ్రెండ్సేనండీ! మీకు కాఫీ కూడా ఇవ్వకుండా పంపానని తెలిస్తే నాన్నగారితో ఇంకేమన్నా వుందా?"

"కాఫీ తాగలేను. మజ్జిగ ఉంటే ఇవ్వండి."

"పోనీ జ్యూస్ తాగుతారా?"

"వొద్దు, మజ్జిగే ఇవ్వండి!"

"శేఖర్! కాఫీ వొద్దులే. మజ్జిగ తీసుకురా!" అని వసంత మళ్ళీ అరిచింది.

"ఇది ఆఫీసర్స్ క్వార్టర్సా? చాలా పెద్దగా వుంది. ఎన్ని గదులు వుంటాయి?"

"క్లాస్ వన్ ఆఫీసర్స్ క్వార్టర్సండీ! నాలుగు బెడ్ రూములు వుంటాయి. ఇంత ఇల్లు మాకు అవసరమే లేదు. చాకిరీ చేయించడానికే యాతనగా వుంది. పని మనుషులు సరిగ్గా పనిచెయ్యరండీ! ఇల్లు చూద్దురు గాని రండీ!" అంటూ లేచింది వసంత.

సత్యానికి ఇంకా వసంతని అడగవలసిన ప్రశ్నలు చాలా వున్నాయి. రావొద్దనుకుంటూ వొచ్చినందుకు కనీసం ఆ ప్రయోజనం అయినా నెరవేరాలి కదా?

హాల్లోంచి లోపల గదుల్లోకి నడిచారు. ఆ గదులు కూడా చాలా విశాలంగా పదిహేనేసి అడుగుల పొడవులూ వెడల్పులూ వుంటాయి తప్పకుండా. ఒక గది పెద్ద బాబుకీ! ఒక గది చిన్నబాబుకీ!

"ఇది మా బెడ్ రూమండీ!" అని ఒక గది చూపిం చింది. అందులో నేల అంతా తివాచీ! ఒక పక్కన రెండు మంచాలూ, ఇంకో పక్క నాలుగు కుర్చీలూ వున్నాయి. అక్కడ కూడా టీవీ వుంది! ఇంకో పక్క డ్రెస్సింగ్ టేబుల్ మీద ఎండి మోడుబారిన మొక్క ఆకారంలో వున్న స్టాండ్‌కి, ఒక్కో కొమ్మకి ఒక్కో రంగు గాజులు వేళ్ళాడుతున్నాయి. సంఘసేవకి పోయే టప్పుడు రోజుకో రంగు గాజులూ పూసలూ మార్చక పోతే, సేవని ఉత్సాహంగా చెయ్యలేరు కదా?

"ఇవన్నీ ఇప్పుడే సర్దుతున్నానండీ, అంతలో మాలీ వచ్చి చెప్తే వొదిలేసి వొచ్చేశాను."

రెండు గదులు కొంచెం చిన్నవి. వాటిలో కూడా మంచాలూ పక్కలూ కుర్చీలూ వున్నాయి. వెనకాల మళ్ళీ పెద్ద వరండా! దాని కిందనించీ వెనక ఆవరణ! అది, ఫెన్సింగ్ దాకా కనీసం ముప్ఫై అడుగులు వుంటుంది!

అక్కడ ఇంకో మనిషి చీపురుతో ఊడుస్తున్నాడు. మొదట చూసిన మాలీ కాడు ఇతను.

వంటింట్లో.... రంగమ్మే కాబోలు. స్టవ్ దగ్గిర పని చేసుకుంటోంది. అరవై ఏళ్ళు దాటివుంటాయి.

"ఈవిడ ఇక్కడే వుంటుందా? ఏ గదిలో వుంటుంది!"

"వెనకాల సర్వెంట్ క్వార్టర్స్ చూడలేదా మీరు? అక్కడ వుంటుంది. వాచ్‌మేన్ కూడా అక్కడే వుంటాడు."

సత్యం, వెనక ఆవరణలో దూరంగా చూస్తే, గోడదగ్గిర, ఎత్తు తక్కువతో రెండు రేకుల షెడ్లు కన పడ్డాయి. అవీ సర్వెంట్ల గృహాలు!

క్లాసవన్ ఆఫీసరుగారి ఇంట్లో ఎటు చూస్తే అటు, ఎక్కడికక్కడ, రకరకాల ఫేషన్ల కుర్చీలూ, మంచాలూ, బల్లలూ, తెరలూ, తివాచీలూ, సర్వెంట్లూ!.... రంగ రంగ వైభవంగా వుంది అంతా!

"ఈ ఇంటిని రోజుకోసారి ఊడ్చడం కూడా కష్టమే" అన్నాడు సత్యం. వెనక ఆవరణలో మామిడి చెట్టు కింద నడుస్తూ.

"అవునండీ! చచ్చిపోతున్నానండీ సర్వెంట్స్‌తో....

ఒకటి చెప్తే ఒకటి చేస్తారు. ఆఫీసు వాళ్ళే ఇస్తారు ఇద్దర్ని. వంట మనిషిని మనమే పెట్టుకోవాలి. అల వెన్స్ ఇస్తారు."

మామిడిచెట్టు కింద బెంచీవుంది.

"ఇక్కడ కూర్చుందాం కాస్సేపు" అన్నాడు సత్యం.

"అయ్యో, అంతకంటేనా? కూర్చుందాం."

నిజంగా ఎంత బాగుందో చెట్టుకింద బెంచీ మీద కూర్చుంటే!

"ఈ చెట్టుకి ఎంత వయస్సు వుంటుంది?"

"తెలీదండీ! ఈ ఇంట్లోకి మేము వచ్చేప్పటికే వున్నాయి, ఈ చెట్లన్నీ."

"ఈ చెట్లకింద తిరిగితే చాలు నాన్నగారి ఆరోగ్యం ఎంతో బాగుంటుంది. ఆయన విజయవాడలో ఒంటరిగా వుండడం ఎందుకూ?"

వసంత కొంచెం నవ్వింది "ఇక్కడే వుండొచ్చు లెండి.... అప్పుడప్పుడూ మా అత్తగారు వొస్తూ వుంటారు. గెస్టులు కూడా వొస్తూ వుంటారు. అలాం టప్పుడు కొంచెం ఇబ్బంది."

"దేనికీ ఇబ్బంది?"

"సర్వెంట్స్‌తోనే సమస్యండీ! చెప్పినట్టు వినరు. నాకేమో అసలు టైమే వుండదు. ఇద్దరు పెద్దవాళ్ళు వుంటే నేనెలా చూసుకుంటాను చెప్పండి?...... అమ్మ వుంటే నాన్నకీ తిప్పలే వుండేవి కావు."

సత్యం కొంచెం నవ్వాడు — " 'అమ్మ వుంటే' అంటే? నాన్న వెళ్ళిపోయేదాకా అమ్మవుండి తీరాలా? అప్పుడు అమ్మని అయినా మీరు చూసుకోవాలి కదా? ఇప్పుడు నాన్నని చూసుకోండీ!"

"అవుననుకోండీ" నవ్వింది.

"అమ్మవుండగా నాన్న పోవచ్చు, నాన్న వుండగా అమ్మపోవచ్చు. ఇద్దరూ ఒకేసారి పోరుకదా? ఎవరో ఒకరు మిగులుతారు."

"అవుననుకోండీ!...... అన్నయ్య ఇండియాలో వున్నా బాగుండేది"

"అన్నయ్య వున్నా నాన్న బాధ్యత అతనిదే కాదు గదా? మీకూ వుండాలి కదా? కొడుకైతే యేం, కూతు రైతే యేం?"

"అమ్మో, మీరలా అంటున్నారా? నాన్న గార్ని అడగండి.... ఆడపిల్ల దగ్గిర వుండడం చాలా నామోషీ అనుకుంటారు ఆయన."

"పెద్దాయన కాబట్టి ఆయన అలా అంటే అంటారు. 'అన్నయ్య వేరూ, నేను వేరూనా' అని మీరు పోట్లాడాలి. ఆయనకి నమ్మకం కలిగించాలి."

"చెప్పాలంటే ..... మా అత్తగారు కూడా అంత మంచి మనిషి కాదండీ. నాన్న ఇక్కడ వుంటే ఆవిడికి ఇష్టం వుండదు."

"ఆవిడ ఇష్టం ఏమిటి మధ్య? తన కొడుకు దగ్గిర తను వున్నట్టే, మీ దగ్గిర మీ తండ్రి వుంటాడు. మీ తండ్రిని దగ్గిర వుంచుకునే హక్కు మీకు వుండదూ? ఆ మాటే అడగండి! నోరు మూసుకుంటుంది. మా చెల్లెల్ని, అత్తగారు ఇలాగే ఏడిపించుకు తినేది. మా చెల్లెలు ఆ మొగుణ్ణే వొదిలి పారేసింది!"

వసంత నవ్వింది. సత్యం మాటలన్నీ ఆమెకి చాలా వింతగా వున్నాయి. ఏం మాట్లాడితే ఏం అంటాడో అని దడ ప్రారంభమైంది.

శేఖర్, ట్రేలో మజ్జిగ గ్లాసు పెట్టుకుని అక్కడికి వచ్చాడు.

వసంత కోపంగా చూసింది "అప్పుడు చెప్తే ఇప్పటికి తెచ్చావా? చూశారా అన్నయ్య గారూ? వీళ్ళు ఇంతేనండీ! ఏ పనీ చెప్పగానే చెయ్యరు."

"రంగమ్మ చెయ్యి ఖాళీ లేదమ్మా! చిన్న బాబు అర్జంటుగా ఆమ్లెట్లు వెయ్యమన్నాడు" అన్నాడు శేఖర్.

"వొచ్చాడా చిన్నబాబు?"

"ఆఁ.... తినేసి మళ్ళీ వెళ్ళిపోయాడు."

"చూశారా, ఇదీ వరస! ఆ బండికొన్నారు మొన్న. ఇల్లు పట్టకుండా తిరుగు తున్నాడు."

సత్యం శేఖర్ని చూస్తూ "మీ ఇల్లు ఎక్కడ? రోజూ ఇంటికి వెళ్ళిపోతావా, ఇక్కడే పడుకుంటావా?" అన్నాడు.

వసంతే చెప్పింది "మా నాన్నగారికి వంటచేసి పెట్టే నాగమ్మే పంపించిందండీ! వాళ్ళ చెల్లెలి కొడుకే."

"విజయవాడ నించి వచ్చాడా?"

"నువ్వు వెళ్ళి పని చేసుకో" అని వసంత శేఖర్ని పంపేసింది.

సత్యం గ్లాసు తీసుకుంటూ కొంచెం నవ్వాడు.

"ఎందుకు నవ్వుతున్నారు?"

"అబ్బే! ఏం లేదు."

"కాదు చెప్పండీ! గ్లాసుని చూసి నవ్వారెందుకు?"

"సరిగ్గా ఇలాంటి గ్లాసుతోటే మొన్న ఒకళ్ళ ఇంట్లో మజ్జిగ ఇచ్చారు."

"అవును, ఈ మధ్యే ఈ గ్లాసులు కొత్తగా వొస్తున్నాయి. ఓ డజన్ గ్లాసులు కొనితెచ్చాను మొన్నే."

"అప్పటి దాకా వుండే గ్లాసులు ఏం చేస్తారు?

"ఇంకేం చేస్తాం? అలా పడివుంటాయి. మిగతా ఆఫీసర్ల ఇళ్ళల్లో కొత్త ఫేషన్వి వాడుతోంటే మనం ఇంకా పాత రకాలే వాడితే ఏం బాగుంటుందండీ?"

"మళ్ళీ ఇంకో కొత్త రకం వస్తే వీటి పనీ అంతేనా?"

వసంత నవ్వింది "అంతేకదండీ? అలాగే పడి వున్నాయి బోలెడు సెట్లు."

"నాకీ సంగతి మొదటే తెలిస్తే నాకు అన్నిటికన్నా పాత గ్లాసుతోనే ఇవ్వమని అడిగేవాణ్ణి" అన్నాడు సత్యం.

వసంత బాగా నవ్వింది "భలే మాట్లాడతారే మీరు" అని మళ్ళీమళ్ళీ నవ్వింది.

మళ్ళీ 'నాన్నగారి' కబుర్లు సాగాయి.

"నాన్నగారికి ఇక్కడేం తోస్తుందండీ?" అంది వసంత.

"ఇక్కడ తోచదా? పిల్లలువున్న ఇల్లు. కాలక్షేపానికేంలోటు?" అన్నాడు సత్యం.

"మీరలా అనుకుంటున్నారా? వీళ్ళకసలు తాతగారితో మాట్లాడ్డానికి ఖాళీ ఎక్కడండీ? ఎప్పుడన్నా వొక్కసారి 'హాయ్ తాతయ్యా' అని పలకరిస్తారు, అంతే. ముఖేకి ఎప్పుడూ మ్యూజిక్ పిచ్చి! సతీకి స్పోర్ట్స్ గోల! ఇంటి పట్టునే వుండడు. ఇప్పుడు బండి కూడా దొరికింది. ఆ బండికోసం డబ్బు మొన్న నాన్నగారే ఇచ్చి వెళ్ళారు."

"తాతయ్య ఇచ్చే డబ్బు కావాలిగానీ, తాతయ్యతో కాస్సేపు మాట్లాడే టైము వుండదన్న మాట ఈ మనవళ్ళకి!"

"అంతే కదండీ ఈ కాలం పిల్లలందరూ?"

మరికాస్సేపటికి వసంత తన మనసులో మాట అతి కష్టంమీద నెమ్మదిగా బయటపెట్టింది. ముందు సత్యాన్ని కాస్సేపు పొగిడింది. "నాన్నగారి ఉత్తరం చూడగానే మీరెవరో తెలీదుగానీ స్వంత మనిషికన్నా ఎక్కువగా అనిపించిందండీ! నాన్నగారు పెద్దవారై పోతున్నారు. ఆయన ఆరోగ్యం ఎప్పుడూ మంచిది కాదు. కాస్త తేడా వచ్చిందంటే మంచాన్న పడి పోతారు.... అన్నయ్య దగ్గిరికి వెళ్ళేమాటే లేదు.... ఇక నేను వున్నా, నా వల్ల ఎలా అవుతుందండీ? నేనే మను కుంటున్నానంటే.... ఓల్డు పీపుల్ హోమ్స్ వుంటాయి కదండీ.... ఎంత డబ్బు అయినా ఫర్వాలేదు..... రాత్రి అన్నయ్యతో మాట్లాడీ నాన్న రాసిన ఉత్తరంలో సంగతులన్నీ చెప్పానండీ.... చాలా బాధపడ్డాడు. 'ఎంత డబ్బయినా ఫర్వాలేదు! ఏదైనా హోమ్‌లో చేర్పిం చెయ్యి, డబ్బు పంపిస్తాను' అన్నాడు. మంచి హోమ్ చూసి.... చేర్పిస్తేనే బాగుంటుందనిపిస్తోందండీ .... అలాంటి హోమ్స్ మీకేవైనా తెలిస్తే.... నాన్నగారికి కూడా చెప్పి వొప్పించవచ్చు. మీరు చెప్తే ఆయన వింటారు. అలాంటిచోట అందరూ పెద్ద వాళ్ళే వుంటారు కాబట్టి, పది మందితోటీ కలిసి వుంటే, ఆయనకీ కాలక్షేపంగా వుంటుంది."

సత్యం నిర్ఘాంతపోతూ విన్నాడు. కానీ, తన ఆశ్చర్యం కొంచెం కూడా బయటపడనివ్వలేదు.

"నిన్న నాన్న ఉత్తరం వచ్చినప్పటినించీ ఈ సంగతే ఆలోచిస్తున్నానండీ!"

"ఈ మాట నాన్నతో ఎప్పుడైనా అన్నారా?"

"అబ్బెబ్బే! లేదండీ.... నేను అనుకోవడమే. అమ్మ పోయినప్పటినించీ నాగమ్మ అనీ ఒకావిడ వొండి పెడుతోంది. ఎంత కాలం అలా జరుగుతుంది? పని వాళ్ళేం చూస్తారండీ పిచ్చిగానీ? హోమ్‌లో అయితే అన్నీ టైమ్ ప్రకారం చేస్తారు. రెగ్యులర్‌గా డాక్టర్లు వచ్చి చూస్తారు. ఇళ్ళ దగ్గిర అవన్నీ ఎక్కడ చెయ్యగలం? అన్నయ్య ఎలాగూ డబ్బు పంపిస్తానంటున్నాడు."

సత్యానికి నోరు పెగల్లేదు.

ఏమిటీ మనిషి! ఇంత ఇల్లు! అన్నిటికీ పని మనుషులు! అర్జంటుగా అవసరమైతే కారు! ఫోను! ఇన్ని సౌకర్యాలు! తండ్రిని దగ్గిర పెట్టుకుని చూసుకోడం ఈ కూతురికి కష్టమా! తన ముస్తాబు కాలంలో రోజూ పది నిమిషాలు తగ్గించుకుంటే చాలు!

తండ్రి పెద్దవాడయ్యాడు! ఒంటరిగా వుంటున్నాడు! ఊహ తెలిసిన దగ్గిర్నించీ తల్లిదండ్రుల గురించి ఎన్నెన్నో జ్ఞాపకాలు వుండవూ? చిన్నప్పుడు

తండ్రి ఎత్తుకుని ముద్దుచేసి వుండడూ? భుజాల మీద తిప్పి నిద్రపుచ్చి వుండడూ? చెయ్యి పట్టుకుని బడికి తీసుకెళ్ళి వుండడూ? జబ్బులు చేస్తే మంచం దగ్గిర కూర్చుని సేవలు చేసి వుండడూ? ఒకటా, రెండా?.... వందల వందల సంఘటనలు వుండవూ? గడిచిన కాలం అంతా ఎలా మరిచిపోతారు, పిచ్చెక్కితే తప్ప? తండ్రిని ఎక్కడో పెట్టాలని ఆలోచనలా? ఇదంతా ఆ తండ్రికి తెలిస్తే? ఏమైపోతాడు?

"ఏమిటి, ఆలోచిస్తున్నారు?" వసంత జంకుతూ చూసింది.

"అదే.... మీరు చెప్పిన సంగతి గురించే."

"అదేనండీ.... మంచి హోమ్ అయితే మా అత్త గార్ని కూడా అక్కడే చేర్పించవచ్చు."

"మీ అత్తగార్ని కూడానా? మీ ఆయన ఒప్పు కుంటారా?"

"అబ్బే, ఆయనకి అవేం పట్టవులెండి. ఒప్పుకోక పోతే ఆవిణ్ణి ఎవరు చూస్తారు ఇక్కడ?"

"మీకు ఇక్కడ దేనికి ఇబ్బంది? ఎవరి గదులు వాళ్ళకి వుంటాయి. వేరు వేరుగా పని మనుషుల్ని పెట్టవచ్చు. పెద్ద వాళ్ళ దగ్గిర కొంచెం ఓపిగ్గా పని చేసేవాళ్ళు వుండాలనుకోండీ! కావాలంటే, అలాంటి వాళ్ళని చూసి పెట్టమంటే ప్రయత్నిస్తాను."

"అయ్యో, అన్నయ్యగారూ! పని మనుషుల సంగతి మీకు తెలీదండీ! జీతాలు పొయ్యడమేగానీ పనులు చెయ్యరండీ! ఏడిపించుకు తింటారు. అస్తమానూ పనులు ఎగ్గొడుతూ వుంటారు."

"వాళ్ళకి కూడా కుటుంబాలూ అవసరాలూ వుండవా? ఎప్పుడన్నా పనికి రాలేకపోతే రాలేకపోతారు. అలాంటప్పుడు వేరే పని మనుషులు వుంటారు కదా? లేకపోతే మనవళ్ళని చూసుకోమనండీ!"

"భలే చెప్పారు! మనవళ్ళు చేస్తారా? వాళ్ళకే మంచినీళ్ళతో సహా అన్నీ అందించాలి."

"పిల్లల్ని అలా ఎందుకు పెంచుతున్నారు?"

"వాళ్ళకి ఏదన్నా పని చెప్తే మా నాన్నగారే వూరు కోరండీ! మా అత్తగారు వుంటే మరీ గొడవ చేసేస్తుంది. 'మొగపిల్లలకి పనులు చెపుతున్నావా' అంటుంది. పోనీ వాళ్ళయితే 'పెద్దవాళ్ళు కదా అలాగే అంటార్లే' అనుకోవచ్చు. పిల్లల నాన్నగారు కూడా అలాగే అంటారు. ఆయన కొడుకులు మంచినీళ్ళు కూడా ముంచుకోకూడదట! ఇక వాళ్ళు నా మాటేం వింటా రండీ? అలాంటి వాళ్ళు తాతగారికీ, నాయనమ్మకీ పనులు చేస్తారా?

ఏ అర్ధరాత్రో అపరాత్రో హఠాత్తుగా ఆస్పత్రికి పోవాలంటే, మా వారసలు ఇంట్లోనే వుండరు. ఎప్పుడూ ఆఫీసే. రాత్రి పన్నెండు దాటితేగానీ రారు."

"ఎందుకు అంతసేపు ఆఫీసులో?"

"ఆఫీసంతా ఈయనే బాధ్యతగా చూసుకుంటా రండీ! పనులన్నీ ఈయన మీదే పడతాయి."

అలా చెపుతాడుకాబోలు ఇంటికొచ్చి! 'ఆఫీసు రథాన్ని నేనే తోలుతున్నాను' అని చెపుతాడేమో! లేకపోతే ఈవిడే ఈ గొప్పలన్నీ చెపుతోందో తనకి.

"వసంతగారూ!.... మీ చిన్నతనంలో అమ్మతోటీ, మీ తోటీ ఎలా వుండేవారు నాన్న?"

"అయ్యో, ఆయన చాలా జాగ్రత్త మనిషండీ! పైసా పైసా కూడబెట్టి మమ్మల్ని చదివించారు. అన్న య్యని ఇంజనీర్ని చెయ్యాలని పట్టుబట్టి చివరికి సాధించారు. అన్నయ్య అమెరికా వెళ్ళిన రోజున ఆయన ఆనందంతో పొంగిపోయారు. నా విషయాలు కూడా చెప్పమంటారా? నాకు పద్దెనిమిదేళ్ళప్పుడు.... తెలిసీ తెలీని వయసనుకోండీ.... వేరే కులం అబ్బా యిని పెళ్ళి చేసుకుంటానని చాలా మొండిపట్టు పట్టాను. అతనికి ఆస్తీ లేదు, పెద్ద చదువూ లేదు. ఇప్ప టికీ ఇంకా క్లర్కుగానే చేస్తున్నాడు. అతన్ని చేసుకుంటే నా జీవితం ఏమైపోయేది? నాన్నగారే చాలా ఓపిగ్గా నచ్చచెప్పి నా మనసు మార్చారు. ఈ సంబంధం వాళ్ళు చాలా కట్నం అడిగినా సరే, నాన్నగారు జంకకుండా అప్పుచేసి మరీ నా పెళ్ళి చేశారు. తర్వాత అప్పులన్నీ తీర్చేశారనుకోండీ! మొదటినించీ చాలా జాగ్రత్త మనిషి కాబట్టే మమ్మల్ని ఇంత వృద్ధిలోకి తీసుకురాగలి గారు."

సత్యానికి ముళ్ళమీద కూర్చున్నట్టుగా వుంది. ఈ మూర్ఖపు మనిషితో ఇంకా మాట్లాడ్డానికేం వుంది? చాలు ఇక! లేవడం ఉత్తమం!

వాచీ చూసుకున్నాడు. వచ్చి అరగంట దాటింది. అబ్బా! ఎంత వేస్టు! ఇప్పటిదాకా రాజుతో మాట్లాడుతూ కూర్చుంటే ఎంత బాగుండేది!

"మీ అమ్మగారి విషయంలో ఎలా వుండే వారు మీ నాన్న?"

వసంత కొంచెం ఆలోచనలో పడ్డట్టు ఆగింది. "అమ్మ విషయంలోనా?.... అమ్మకి కొంచెం అసంతృప్తిగానే వుండేదండీ! అమ్మ చాదస్తంగా వుండేది కొంచెం. నాన్న మీద చాలా అనుమానాలు వుండేవి అమ్మకి. ఆడవాళ్ళు గిరిగీస్తే మొగాళ్ళు ఆగుతారా చెప్పండి? అందులోనూ, వెనకటి రోజుల్లో మొగవాళ్ళు అసలే వినేవారు కారుగదా? వెనకటి రోజుల్లో ఏవో చేశాడని అదే మనసులో పెట్టుకుంటే ఎలాగండీ? చివరి రోజుల్లో అసలు మాట్లాడేదేకాదు నాన్నతో...."

సత్యం ప్రతీమాటా చాలా శ్రద్ధగా విన్నాడు. వసంత తల్లి మీద చాలా గౌరవం కలిగింది. ఈ కూతురు, తండ్రి పక్షం అన్న మాట! కట్నం ఇచ్చి పెద్ద సంబంధం తెచ్చి పెళ్ళి చేశాడని! పోనీ, అంత చేసిన తండ్రిని, పెద్దతనంలో తన దగ్గిర పెట్టుకోడానికి సిద్ధంగా వుందా అంటే, అదేం లేదు.

కానీ తనకి తండ్రిమీద ఎంతో ప్రేమ వున్నట్టూ, గత్యంతరం లేక తను ఇలా ఆలోచిస్తున్నట్టూ, ఇతరుల్ని నమ్మించాలని ప్రయత్నం!

'పాపం ఇంట్లో వాళ్ళు కలిసి రాకపోతే, ఈవిడ వొక్కతీ ఇద్దరు ముసిలాళ్ళతో ఎలా వేగుతుంది, హోమ్‌లో పెట్టక? అని ఇతరులు అనుకోవాలన్న మాట!'

వొచ్చి వొచ్చి ఈ రొంపిలో పడ్డాడు. తను! రేపట్నించీ 'హోమ్ దొరికిందాండీ' అని పట్టుకుంటుందో ఏమో ఫోనుల్లో!

"వసంతగారూ! నేనో మాట అడగనా? కొన్నేళ్ళకి మనం కూడా పెద్ద వాళ్ళమై పోతాం. రేపు, మీ పిల్లలు కూడా మీతో 'ఏదన్నా హోమ్‌లో వుండమ్మా, ఎంత డబ్బయినా కట్టేస్తాం. నిన్ను ఇంట్లో వుంచి చూసుకోడం మాకు చాలా కష్టం' అంటారనుకోండీ! ఎలా వుంటుంది మీకు? ఊహించండి, ఒకసారి!"

వసంత మొదట కంగారు పడుతూ వింది. తర్వాత, తేలిగ్గా నవ్వేసింది. "ఇందులో ఊహించడానికేం వుందండీ? వాళ్ళు చెప్పేదాకా ఎందుకూ? మనమే ఆ ఏర్పాట్లన్నీ చేసుకోవాలి. లేకపోతే మనకి చాకిరీలు చేస్తూ కూర్చుంటారా వాళ్ళు?" అంది.

సత్యం తెల్లమొహం వేశాడు కాసేపు. మళ్ళీ వాచీ చూసుకున్నాడు. "వెళ్తానండీ! చాలాసేపైంది" అని లేచాడు.

"అయ్యో, అప్పుడేనా? మీతో మాట్లాడినట్టే లేదు. మీరు మా ఇంట్లో మనిషిలాగే అనిపిస్తున్నారు! .... మళ్ళీ విజయవాడ వెళ్ళినప్పుడు నాన్నగారి దగ్గిరికి వొస్తానని అన్నారటగా? వెళ్తే ఒక మాట చెపుతారా? ముఖేకి డొనేషన్ కట్టాల్సి వొచ్చేలాగ వుందండీ! నాన్నతో అనాలంటే నాకు సిగ్గుగా వుంది. ఆయనకి తెలిస్తే, తప్పకుండా పంపుతారు."

"అతన్నే ఉత్తరం రాయమని చెప్పండి తాతగారికి."

"అయ్యో, వాళ్ళకి అంత వొళ్ళొంగుతుందా? ఉత్తరాలంటే నాకే బోలెడు బద్ధకం.... సరేలెండి. మీకెందుకు శ్రమ. నేనే రాస్తాలెండి."

ఇద్దరూ ముందు వరండా దాకా వచ్చారు.

వసంత కొంచెం తలవాల్చి చిర్నవ్వుతో అంది "అన్నయ్యగారూ! నేను చెప్పిన సంగతి కొంచెం గుర్తు పెట్టుకుంటారా?"

"ఏమిటి? హోమ్ సంగతా?"

అలాగే నవ్వుతూ చూసింది.

"నిజానికి మీకా అవసరం లేదండీ! మీరు కూడా ఇలా ఆలోచిస్తే, చాలా అన్యాయం! తల్లి దండ్రులు పిల్లల్ని పెంచి పెద్ద చేస్తారు. అది వాళ్ళ బాధ్యత! మరి పిల్లల బాధ్యత ఏమీ వుండదా? తల్లిదండ్రులు పెద్ద వాళ్ళయి పోయినప్పుడు వాళ్ళని పిల్లలే చూసుకోవాలి. అది పిల్లల బాధ్యత! అంతేగానీ హోముల్లో పెట్టడం కాదుగదా? మళ్ళీ ఆలోచించి చూడండి! మీ అభిప్రాయం ఏమన్నా మారుతుందేమో!.... వెళ్తానండీ!"

వసంతకి మళ్ళీ నోరెత్తడానికి ధైర్యం చాలలేదు.

బయటపడ్డాడు సత్యం, మళ్ళీ ఫుట్‌పాత్ మీద వేపచెట్ల బోడికొమ్మలు చూసుకుంటూ! అంతేకాదు.... "అబ్బా' ఎంత బుద్ధిలేనిపనిచేశానో!" అని తనని తను తిట్టుకుంటూ కూడా!

"సార్.... సార్" అంటూ ఫెన్సింగ్ పక్కనించి శేఖర్ పరిగెత్తుకొచ్చాడు. వెనక్కి వెనక్కి చూస్తూ గాభరాగా

మాట్లాడాడు. "సార్.... మీరు మా ఊరు వెళ్తారా? మా నాగమ్మకి చెప్పండి సార్! నన్ను తీసుకు పొమ్మని చెప్పండి సార్! నేనిక్కడ వుండను. తప్పకుండా చెప్పండి సార్!.... సార్! చెప్పండి సార్!" అంటూ గేటు లోపలికి పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయాడు.

సత్యానికి అర్థమే కాలేదు మొదట. నిలబడి అలాగే చూశాడు గేటు వేపు!

నెమ్మదిగా అర్థమైంది .... విజయవాడలో నాగమ్మకి ఒక కబురు చెప్పమంటు న్నాడు తనని. 'వీణ్ణి నాగమ్మే పంపింది' అని వసంత చెప్పిన మాటలు సరిగ్గా విని ఉండకపోతే కొంపమునిగే దన్నమాట!

ఎంత మంచిదైంది, ఇక్కడికి రావడం! ఎంత మంచిదైంది!!

★ ★ ★

విశాలంగా ఉన్న గదిలో టేబుల్ ముందు వెదురు కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్న శర్మని చూసినప్పుడు, "పొరపాటున ఇంకో ఇంటికి వచ్చానా" అని ఒక్క క్షణం తికమక పడ్డాడు సత్యం.

రైల్లో చూసిన మనిషేనా ఈ మనిషి? తెల్లటి ఇస్త్రీ లుంగీ, చొక్కా! పరిశుభ్రంగా, ఎర్రగా పండులా మెరిసిపోతున్నాడు! పదేళ్ళు వయసు తగ్గిన వాడిలా ఆరోగ్యంగా కనపడుతున్నాడు. వారం రోజుల్లో ఇంత మార్పా? కుర్చీ పక్కనే పువ్వులాంటి తెల్లటి ఇస్త్రీ దుప్పటి పరిచిన మంచం! కుర్చీ వెనకాల కవరూ, కిటికీ తెరలూ, టేబుల్ మీద బట్టా, వంకీకి వేళ్ళాడు తోన్న తువ్వాలూ అన్నీ పువ్వుల్లాగే మెరిసిపోతున్నాయి. నేలంతా శుభ్రంగా వుంది. వస్తువులన్నీ ఎక్కడి వక్కడ పొందిగ్గా వున్నాయి. ఒక్కచూపుతో 'శర్మగారు హాయిగా వున్నాడు' అనిపించింది సత్యానికి.

గుమ్మంలో నిలబడి పోయిన సత్యాన్ని చూసి శర్మ ఆశ్చర్యపోతూ, కళ్ళజోడు సర్దుకుంటూ "మీరా! మీరా! ఎప్పుడొచ్చారు? ఇవ్వాళ వచ్చి వుంటారేమో అను కున్నాను గానీ .... ఇల్లు తేలిగ్గా దొరికిందా? వొచ్చారన్న మాట!.... రండి! రండి! వొచ్చారే! కూర్చోండి!" అని ప్రశ్నలు గుప్పించేస్తూ సత్యం చెయ్యి పట్టుకుని కుర్చీదాకా తీసుకు వొచ్చి భుజాలు పట్టుకుని కుర్చీలో కూర్చోబెట్టాడు.

"మీరిప్పుడు చాలా ఆరోగ్యంగా కన పడుతు న్నారు" అన్నాడు సత్యం ఇంకా ఆశ్చర్యంగానే చూస్తూ.

"ఇక్కడ వుంటే నాకు బాగానే వుంటుంది. మీ వూరు వస్తేనే ఏదో ఒక తెగులు పట్టుకుంటుంది. అక్కడ గాలి పడదో, నీళ్ళుపడవోగానీ" అన్నాడు శర్మ నవ్వుతూ. మాట కూడా ఎంతో ఆరోగ్యంగా వుంది!

అరగంట కాలం పది నిమిషాల్లా గడిచిపోయింది. శర్మ ఇంటి పరిస్థితి అంతా చాలా వరకు అర్థమైంది సత్యానికి.

ఆ ఇల్లు శర్మ స్వంత ఇల్లే! కిందా పైనా కలిసి నాలుగు పెద్దపెద్ద వాటాలు. మూడు వాటాలు అద్దెలకి ఇచ్చేశాడు. అవిగాక, ఇంటికి ఒక పక్క రోడ్డు వేపు మూడు షాపులు! అవీ అద్దెలకే! వెనకాల పెరట్లో ఒక మూల రేకుల షెడ్లో బట్టలు ఇస్త్రీ చేసే ఒక కుర్రవాడు వుంటున్నాడు. అతనే శర్మ బట్టలన్నీ, ఉతికి ఇస్త్రీ చేసి ఇస్తాడు. అందుకని అతనికి కొంచెం అద్దె తక్కువ! మొత్తం మీద అద్దెల ద్వారా నెలనెలా కొన్ని వేలు వస్తాయి! 'వడ్డీల' ద్వారా ఇంకా కొన్ని వేలు!

'పెరట్లో.... బట్టల ఇస్త్రీ కుర్రాడు' అనే మాటలు విన్న తర్వాత సత్యానికి రైల్లో ఆ మాసిన బట్టల రహస్యం దొరికినట్టయింది. అవన్నీ తెచ్చి ఈ కుర్రాడికి అప్పజెప్పాలనా అక్కడ ఉతికించకుండా తీసు కొచ్చింది? అంతేనా?

కూతురు —"అన్ని ఉతికించే ఇచ్చానండీ" అని తండ్రి మీద అనురాగం వొలికిస్తూ చెప్పిందే! ఆ కుళ్ళు గుడ్డలన్నీ తెచ్చి ఈ అబ్బాయికి అప్పజెప్పాడా?

నాగమ్మ రెండేళ్ళనించీ శర్మకి పని మనిషీ, వంట మనిషీ కూడా. ఆమెకి భర్తా పిల్లలూ లేరు. పిల్లలు పుట్టిపోయారు. దాదాపు నలభై దాటి వుండొచ్చు. మనిషి పొడుగ్గా సన్నగా తెల్లగా వుంది. జుట్టు ముడి వేసుకుంది. చేతులకు వెండి గాజులూ, మెడలో ఏదో పూసలదండా, బొట్టు లేదు. మొహం ఎంతో అమాయ కంగా వుంది. జానకి పోలికల్లా వున్నాయి. జానకి పెద్దదైతే ఇలాగే వుంటుందేమో! నాగమ్మకి ఇంకా తల్లి వుంది. డెబ్భై దాటిన ఆవిడ, ఏదో పల్లెటూళ్ళో చిన్న కూతురి దగ్గర వుంటుంది. అంటే శేఖర్ తల్లి దగ్గర.

నాగమ్మ ఇటూ అటూ తిరుగుతూ పని చేసుకుంటోంది.

'ఈవిడ సంరక్షణలో శర్మజీవితం ఎన్నాళ్ళయినా సుఖంగా జరిగిపోతుంది. సందేహం లేదు' అనిపించింది సత్యానికి.

సత్యం, శర్మతో మాట్లాడుతూ మధ్య మధ్య నాగమ్మతో కూడా మాట్లాడుతూనే వున్నాడు.

"మొన్న మీ శేఖర్‌ని చూశానండీ! వసంత గారింటికి వెళ్ళాలెండి. అప్పుడు చూశా."

నాగమ్మ ఆశ్చర్యంగా చూసింది. నమ్మ లేనట్టు చూసింది. మొహం ఎంత వికసించిందో! చేతిలో పని ఆపి రెండడుగులు ముందుకొచ్చి "బాగున్నాడాండీ? వాళ్ళమ్మ ఎంత కలవరిస్తోందో!" అంది.

"ఎన్నాళ్ళయింది అక్కడికి వెళ్ళి?"

"ఆర్నెల్లు దాటిందండీ"

"అప్పట్నించీ రానేలేదా?"

"లేదండీ, మొన్న అయ్యగారు వెళ్ళినప్పుడు తీసుకొస్తానన్నారుగానీ, రానన్నాడంటండీ."

శర్మ నవ్వుతూ "వాస్తావేవిట్రా అంటే రానండీ అని తలతిప్పేశాడు. 'సరే ఈసారి వచ్చినప్పుడు తీసికెళ్తాలే' అన్నా. అక్కడ పిల్లలతో హాయిగా వున్నాడు. తిన్నంత తిండి! అంతకన్నా ఏం పెడుతుందేవిటి నీ చెల్లెలు కొడుక్కి?" అన్నాడు.

నాగమ్మ కూడా కొంచెం నవ్వి ఊరుకుంది.

సత్యం శర్మని సందేహిస్తూ చూశాడు. ఈయన పెద్ద అబద్ధం చెప్పేశాడన్న మాట! ఎంత ఆశ్చర్యం! ఇంత పెద్ద మనిషి! పెద్ద భక్తుడు!

నాగమ్మ రెండు ప్లేట్లతో అరటి పళ్ళూ కమలా పళ్ళూ తెచ్చి బల్లమీద పెట్టింది. తెల్లటి తువ్వాలు తెచ్చి కుర్చీమీద పెట్టింది.

"కూరగాయలు తెస్తానయ్యా" అంది శర్మతో. వెంటనే శర్మ, టేబుల్ తాళం తిప్పి సొరుగులాగి డబ్బులు తీసి ఇచ్చాడు.

సత్యానికి, శేఖరు అప్పగించిన పని మనసులో మెదులుతూనే ఉంది. అసలు ఇంత తొందరగా శర్మ ఇంటికి వచ్చింది అందుకే! "తొందరగా వొచ్చేస్తారా?" అన్నాడు నాగమ్మతో.

"దగ్గిరేనయ్యా! వొచ్చేస్తాను. కొంచెం పిండి కూడా ఆడించాలండీ. అదీ అక్కడే లెండి. వొచ్చేస్తాను."

"సరే వెళ్ళండి, మీరొచ్చేదాకా కూర్చుంటాలెండి."

నాగమ్మ వెళ్ళాక శర్మ మరీ ఉత్సాహంగా కనపడ్డాడు. "తినండి, తినండి" అని కమలా పండు తీసి సత్యానికి అందించాడు. సత్యం దాన్ని వొలిచి శర్మ ప్లేటులో పెట్టాడు.

శర్మ నవ్వి "ఎదటి వాళ్ళకి సేవ చెయ్యడమే మీ నైజం అనుకుంటానే!" అన్నాడు.

సత్యం అదేం పట్టించుకోకుండా "రోజూ మీ దినచర్య ఏమిటి?.... అన్నట్టు మీకు ముఖేష్ చాలా ఇష్టమట కదా? ఇప్పటికీ వింటున్నారా ఆ పాటలు?"

"ఆఁ .... ఏం వింటాం? అవన్నీ అప్పుడే పోయాయి. పెద్దవాళ్ళం అయిపోతోంటే ఇంకా సినిమా పాటలేవిటి?"

"అదేవిటి, సంగీతానికి పెద్దా చిన్నా ఏమిటి? చెప్పాలంటే, పెద్దతనంలోనే సంగీతాలూ సాహిత్యాలూ మరీ అవసరం. విశ్రాంతిగా వాటితో ఆనందంగా గడపొచ్చు. మరి సంగీతాలు వొదిలేసి ఇప్పుడేం చేస్తున్నారో చెప్పండి పోనీ."

శర్మ పొంగిపోతూ టేబుల్ మీదనించీ ఒక బైండు తీసి సత్యానికి అందించాడు.

"ఇది పూర్తి చెయ్యాలి. ఎప్పటికి అవుతుందో!" అన్నాడు.

చూస్తే, అది 'రామకోటి' రాస్తోన్న బైండు!

సత్యం మొహం చిట్లించాడు. "ఇదా? ఎన్నాళ్ళ నించీ ఈ వ్యవహారం?"

"మీకు నచ్చదులెండి. మూడేళ్ళు దాటింది మొదలుపెట్టి. ఇది ఇరవై మూడో బైండు. ఇంకా...."

"డెబ్బై ఏడు బైండ్లు నింపాలన్న మాట!"

"అవును, ఇంకో పదేళ్ళు...."

సత్యం, చేతిలో పుస్తకం టేబుల్ మీద పెట్టేశాడు. "ఎందుకీ పని? ఎవరికి ఉపయోగం? నలుగురు పేద పిల్లల్ని కూర్చో బెట్టుకుని రోజుకో గంట వాళ్ళకి నాలుగు అక్షరం ముక్కలు నేర్పితే వాళ్ళు జన్మంతా మిమ్మల్ని గుర్తు పెట్టుకుంటారు."

"ఇన్నాళ్ళూ చేసింది అదేగా? ఈ చివరి కాలంలో

నా ముక్తికి నేనేమీ చేసుకోవద్దంటారా?" అని నవ్వాడు శర్మ.

"'ముక్తి'కి మన నిర్వచనాలే వేరు. సరే పోనివ్వండి.... వేరే కబుర్లు చెప్పుకుందాం. మీ భవిష్యత్ కార్యక్రమం ఏమిటి? ఇక్కడే ఉండదల్చుకున్నారా? లేకపోతే, మీ అబ్బాయి దగ్గిరికి వెళ్తారా, అమ్మాయి గారింట్లో వుంటారా? ఇంకా ఏదీ అనుకోడం లేదా?" అని ప్రారంభించాడు సత్యం.

శర్మ చాలా ఆశ్చర్యపోయినట్టుగా చూశాడు. "సరిగ్గా ఈ విషయమే మీతో మాట్లాడాలనుకున్నాను. మొన్న వచ్చినప్పటినించీ ఈ సంగతే సీరియస్‌గా ఆలోచిస్తున్నాను.... అమెరికా వెళ్ళేమాట లేదు లెండి. అది కుదరదు.... నేనూ వుండలేను.... ఇక అమ్మాయి గారింట్లోనా? అదీ వీలుకాదు."

"ఏం, ఎందుకు వీలుకాదు? లంకంత ఇల్లు! ఆ చెట్ల కింద కుర్చీ వేసుకుని కూర్చుంటే చాలు! రోజంతా ఆనందంగా గడిచిపోతుంది కాలం!"

"గడవదని కాదు. ఆడ పిల్ల ఇంట్లో వుండడం నాకు మనస్కరించదు. కూతురు మన మనిషి కావచ్చుగానీ, అల్లుడు మన మనిషి కాడు గదా? ఏమంటారు?"

"ఇది మరీ బాగుంది. కూతుళ్ళ దగ్గిర వుండా లంటే, 'అల్లుళ్ళు మనవాళ్ళు కారు గదా' అంటారు. కొడుకుల దగ్గిర వుండా లంటే, 'కోడళ్ళు మనవాళ్ళు కారుగదా' అంటారు. ఇంకెక్కడ వుండాలి పెద్దవాళ్ళు? పెద్దవకుండానే ఏ యాభయ్యో ఏటో చచ్చి పోవాలా? భలే అడ్డగోలు వాదాలు చేస్తారు! కొడుకులూ కూతుళ్ళూకూడా వేరే ఇళ్ళల్లో అల్లుళ్ళే, కోడళ్ళే. ఆ సంగతి మరిచిపోకండి. అల్లుళ్ళమీదా కోడళ్ళమీదా నిందలు ఎందుకు? కొడుకులే కూతుళ్ళే శ్రద్ధగా చూసుకుంటే సరిపోతుంది కదా?"

శర్మ కొంచెం నవ్వాడు "మీరు మీ పేరుకి తగ్గట్టే సత్యకాలం మనిషి! కూతుళ్ళూ కొడుకులూ మాత్రం చూస్తు న్నారా ఈ రోజుల్లో?"

"సరే, చూడరే అనుకోండీ. అప్పుడు తల్లి దండ్రులేం చెయ్యాలి? తమ ఆస్తులన్నీ పట్టుకుపోయి ఆ చూడని పిల్లలకే సమ ర్పిస్తారెందుకు? మీరు కూడా అలాగే చేస్తారా?"

"చెయ్యక ఏం చేస్తాం? పిల్లలకి కాకపోతే ఆస్తి ఇంకెవరికి అప్పజెపుతాం? నా స్నేహితుడు ఒకాయన సూపర్నెంటుగా చేసి రిటైరయ్యాడు. పిల్లలు లక్ష్య పెట్టకపోతే మద్రాసు వెళ్ళిపోయి హోమ్‌లో చేరాడు. కానీ, ఆస్తులన్నీ పిల్లలకే ఇచ్చాడు."

"ఎందుకు ఇవ్వాలి? ఆ హోమ్‌కే ఇవ్వొచ్చు కదా? లేకపోతే జనాలకి ఉపయోగపడేలాగ ఏ స్కూలుకో ఆస్పత్రికో ఇవ్వొచ్చు కదా?"

శర్మ నవ్వాడు "పిల్లలు ఉసూరుమంటారండీ!"

"మరి తల్లిదండ్రుల్ని హోమ్‌ల్లోకి తోలేస్తే వాళ్ళు ఉసూరుమనరూ?"

"సరి! తల్లి మనసు లక్కా, పిల్ల మనసు రాయీ — అంటారు. ఎప్పుడన్నా విన్నారా?"

"ఆఁ విన్నాం! చాలా విన్నాం! ఈ లక్కలూ రాళ్ళూ తీసెయ్యండి! 'పిల్లలకి బుద్ధిలేదు, తల్లి దండ్రులకు సిగ్గులేదు' అని కొత్త సామెత చెప్పండి. అది సరిగ్గా సరిపోతుందీ" అన్నాడు సత్యం ఆగ్రహంగా.

"మీతో చాలా కష్టమండీ" అని నవ్వాడు శర్మ. "నా ఆలోచన మీకు చెప్తే ఏమంటారో!" అని ఆగాడు.

"ఏమిటి? మద్రాసు హోమ్‌లో చేరి పోతారా మీరుకూడా?"

"అబ్బే, అదికాదు. అంత అవసరం లేదులెండి నాకు...." అంటూ శర్మ, 'నాగమ్మ ఎక్కడ వుందీ' అన్నట్టు వంటింటి వేపూ, వాకిలి వేపూ చూశాడు.

ఆ మనిషి వినకుండా చెప్పాల్సినంత రహస్యం ఏమిటో మరి!

"నాగమ్మ బజారుకి వెళ్తానని చెప్పిందిగా" అన్నాడు సత్యం.

"ఓహో! అవునవును, మరిచిపోయాను ..... నాగమ్మ చాలా కుదురైన మనిషండీ! రెండేళ్ళనించీ చూస్తున్నాను. ఒళ్ళు దాచుకోదు. పని మనిషిలాగా అనిపించదు. నాకు ఎలా కావాలో అలా చేసి పెడుతుంది."

"అయితే ఇంకేం? హాయిగా వుంది. ఇక్కడే ఇలాగే సాగనివ్వండీ!"

"సాగనివ్వొచ్చుగానీ.... మొన్న వాళ్ళ మ్మకి బాగా

లేదని బజార్లో ఎవరో చెప్పారు. అప్పటికప్పుడు బైల్దేరింది. నాకు నానా యాతనా అయింది."

"ఆవిడ కూడా పెద్దావిడే అట కదా?"

"పెద్దావిడ అయితే మాత్రం? అక్కడ చిన్న కూతురు వుంది కదండీ?"

"ఉండొచ్చు. ఈవిడ కూడా కూతురే కదా? తల్లికి బాగా లేదంటే వెంటనే చూడాలా అక్కర్లేదా? అలాంటి సందర్భాల్లో మీరే సర్దుకోవాలి."

కొంచెంసేపు మౌనంగా వుండి ప్రారంభించాడు శర్మ — "నేను చిన్నతనం నించీ సంస్కరణాభిలాష వున్న వాడినేనండీ! కులాల పట్టింపులు నాకు ఎప్పుడూ లేవు. నాగమ్మ కులం వేరనుకోండీ, అయితే మాత్రం? అందరూ మనుషులు కారా? ఆమె కూడా దిక్కులేని పక్షిలాగా ఒంటరిగా వుంది.... తెగించి ఆమె మెళ్ళో మూడు ముళ్ళూ వేస్తే.... ఎలా ఉంటుందంటారు? మీరు చాలా హర్షిస్తారనుకుంటున్నాను."

అర్థం కాలేదు సత్యానికి. 'నిజంగా విన్నానా?' అని శర్మని నిర్ఘాంతపోతూ చూశాడు. "ఏవిటి? మూడు ముళ్ళేవిటి?" అన్నాడు ఆశ్చర్యంగా.

శర్మ కంగారు పడలేదు. చాలా స్తిమితంగానే వున్నాడు. తన అభిప్రాయం సత్యానికి నిజంగా అర్థమైతే అతను తప్పకుండా సంతోషిస్తాడనే నమ్మకంతో వున్నాడు. కొంచెం నవ్వుతూ అన్నాడు "అదే నండీ! మీలాంటి వారిని నలుగుర్ని పిలిచి దండలు మార్చుకున్నా సరిపోతుంది .... ఇద్దరం ఒకరికొకరం తోడూ నీడా! ఒక వాటా ఆమెకి రాసేస్తాను. మా పిల్లలు కొంచెం గొడవ చేస్తారుగానీ.... ఇదంతా నా స్వార్జితం! ఏనాడో చౌక రోజుల్లో కొన్నాను ఈ స్థలం. పైసా పైసా కూడబెట్టి అప్పులూ సప్పులూ తెచ్చి ఈ ఇల్లు కట్టించాను... నేను పెళ్ళి చేసుకునే మనిషికి కొంత ఆస్తి ఇస్తే తప్పంటారా?"

సత్యానికి అప్పటికి అర్థమైంది — 'నాగమ్మని పెళ్ళి చేసుకుంటాను' అంటున్నాడు శర్మ! ఆ సంగతి అర్థమవుతూ వుండగానే సత్యానికి ఆగ్రహం తోటీ, అసహ్యం తోటీ శరీరమంతా ఒక జలదరింపు పాకింది. ఏం అనాలో, ఏం అడగాలో, ఏం చెప్పాలో తోచనట్టు అయిపోయింది. ఉద్వేగాన్ని అణుచుకుంటూ అప్రయత్నంగా "ఎందుకు?" అన్నాడు. మళ్ళీ వెంటనే — "పెళ్ళా? ... మీకా? ఈ వయస్సులోనా?" అన్నాడు గబ గబా.

"అంత ఆశ్చర్యపోతున్నారేమిటి? ఆమెకి అన్యాయం చేస్తాననుకోకండి! తప్పకుండా ఎంతో కొంత ఆస్తి ముట్టజెపుతాను"

'అలాగా? ఆస్తి ఇస్తారా? అయితే ఫర్వాలేదు' అని సత్యం సంతోషిస్తాడని శర్మ నమ్మకం.

కానీ సత్యం మరింత ఆగ్రహంగా "ఆమెకి మీరు అన్యాయం చేసేదేమిటి, ఆమెకి ఆమే చేసుకుంటే తప్ప? ఇంతకీ... నాగమ్మ ఏమందో చెప్పండి. ఒప్పుకుందా?" అన్నాడు ఆతృతగా.

"అబ్బే, నేనింకా అడగలేదు."

"ఏవిటీ! ఆమెని అడగకుండానే, ఆమెకి తెలియకుండానే, ఆమెని పెళ్ళి చేసుకుంటానని మీరు నాకు చెప్పేస్తున్నారా? ఇంకా ఎంత మందికి చెప్పారు?"

"మొట్టమొదట మిమ్మల్నే సలహా అడుగుతున్నానండీ! మీ దగ్గిరే అంటున్నాను ఈ మాట! చాలా ఆవేశపడిపోతున్నారు మీరు. కొంచెం శాంతంగా ఆలోచించి చూడండి! పిల్లాజెల్లా లేని మనిషిని చేరదీసి కొంత ఆస్తి ముట్టజెప్తే రేపు ఆమెకి ఆధారంగా వుండదూ?"

'ఛీ! ఈ మనిషితో ఇంకా మాటలేమిటి?' అని తక్షణం లేచి పోదామనిపించింది సత్యానికి. కానీ, ఈ మనిషి తప్పకుండా నాగమ్మకి ఏదేదో చెప్పి ఒప్పిం చేస్తాడేమో! అసలే అమాయకురాలి లాగా వుంది. ఆమెని, ఈ ముసలి గుంటనక్క చేతుల్లో వొదిలేసి తన దారిన తను పోకూడదు. నాగమ్మ కోసం వీడితో ఘర్షణపడి తీరాలి! నాగమ్మని హెచ్చరించి తీరాలి! తను వెళ్ళిపోతే నాగమ్మకి అన్యాయం చేసినట్టే! — అంత ఆలోచించాక సత్యాన్ని శాంతం ఆవరించింది.

"రెండేళ్ళనించీ నాగమ్మ మీకు చేసి పెడుతూనే వుంది కదా? ఇప్పుడీ కొత్త ఆలోచన ఎందుకు వచ్చింది మీకు?" అన్నాడు శర్మని తరిచితరిచి చూస్తూ.

శర్మ కొంచెం స్తిమితంగా నవ్వాడు. "అలా కొంచెం శాంతంగా మాట్లాడండి సత్యంగారూ!.. ఎందుకంటారా? ఒకరికొకరం అండ అని చెప్తినే...."

"ఆమెకి మీరిచ్చే అండ ఏమిటి? ఆమె రెక్కలే ఆమెకి అండ! మీరు ఆలోచించేదంతా మీ కోసమే. ఆమె కోసం కాదు."

"పోనీ, అలాగే అనుకోండి! నా కోసమే అనుకోండి! తప్పంటారా?"

"తప్పో కాదో మీకు తెలీడం లేదా?"

"నాకేం తప్పనిపించడం లేదు. నుదుటి మీద ఇంత కుంకుం పెట్టుకునే ప్రాప్తంలేని మనిషికి ఇంత బొట్టు పెడతానంటే అది తప్పు కాదు."

"కుంకాల వల్ల ఆడవాళ్ళకి వొరిగేదేమీ లేదండీ, మొఖాలు ఖరాబు చేసుకోవడం తప్ప! బొట్టే అంత అవసరమైతే, దానికి భర్తతో ఏం సంబంధం? భర్త లేక పోతే బొట్టు పెట్టుకోకూడదనే రూలేమిటి అసలు? బొట్టుకోసం పెళ్ళి చేసుకోవాలా?... నాగమ్మ, పెళ్ళి చేసుకోవాలనుకుంటే, తన వయసుకి తగిన వాణ్ణే చేసుకుంటుంది. మిమ్మల్నెందుకు చేసుకోవాలి?" అంటూ గబగబా, ఆకులు దూసిపోసేసినట్టు ప్రశ్నలు గుప్పించాడు సత్యం.

శర్మ ఏడుపు మొహం పెట్టాడు. "చేసుకోమనండి అయితే. పడుచువాడు దొరికితే అలాగే చేసుకోమనండి. ఎవరొద్దంటారు?"

"దొరికితేనే చేసుకుంటుంది, లేకపోతే మానుకుంటుంది. పడుచువాడు దొరక లేదని ముసలివాణ్ణి చేసుకోవాలా? దేనికోసం ఆ పెళ్ళి?" అన్నాడు సత్యం నిర్మొహ మాటంగా. ఇక, ఈ ముసలి పెళ్ళి కొడుకుతో నిర్మొహమాటంగానే ఉండదల్చుకున్నాడు సత్యం.

శర్మ బలహీనంగా నవ్వాడు "అయ్యా, మీరిలా చెరిగి పోసేస్తోంటే నేనేం చెప్పగలను చెప్పండి?" అన్నాడు.

"సరే, మీరే చెప్పండి. మీకీ కొత్త ఆలోచన ఎందుకు? నాగమ్మ మీకు చేసి పెడుతూనే వుందిగా?"

"అబ్బే, దీనికి నికరం ఏం వుంది? నా కష్టం కూడా కొంచెం ఆలోచించండి! మొన్న వాళ్ళమ్మకి బాగాలేదని వెళ్తే, వొస్తుందా రాదా అని చాలా కంగారు పడాల్సి వొచ్చింది."

"ఏం, ఎందుకు రాదనుకున్నారు? ఆమెకి జీతం అక్కరలేదా?"

"ఆఁ, జీతం! ఇంకొకరు ఇంకో పది రూపాయలు ఎక్కువ పడేస్తామంటే అటుపోతారు."

"ఛీ! ఈ మనిషితో మాటలా!" అని తక్షణం లేచి పోదామనుకున్నాడు సత్యం. కానీ నాగమ్మ కోసం మళ్ళీ నిగ్రహించుకున్నాడు. శేఖర్ కోసం కూడా.

"అయితే మీరు చెయ్యాల్సిందేమిటో తెలుసా? ఆ పది రూపాయలూ మీరే పెంచండి! మీరే ఇతరులకన్నా ఎక్కువ జీతం ఇవ్వండి! ఎక్కడికీ వెళ్ళకుండా మీ దగ్గిరే వుంటుంది.... మీ నోటితో మీరే చెప్పారు కదా, ఆమె ఎంతో శ్రద్ధగా పని చేసిపెడుతుందనీ? మీరు మీ కూతురి ఇంట్లో నెల్లాళ్ళు వుంటే ఎలా తయారయ్యారు? ఇక్కడ వారం రోజులకే ఎంత ఆరోగ్యంగా వున్నారు! ఇంత శ్రద్ధగా పని చేసే మనిషికి ఆమె సంతోషపడేంత జీతం ఇవ్వలేరా? మంచి జీతం ఇస్తే ఇంకెక్కడికో ఎందుకు వెళ్తుంది?"

"ఎంత జీతం ఇచ్చినా అదంతా వాళ్ళమ్మ తెగుళ్ళకే పెడుతుంది. ఈమెకి ఖర్చేం వుంది అసలు? తిండి ఇక్కడే తింటుంది."

ఓరి దరిద్రుడా! తల్లి తెగుళ్ళకి కూడా పెట్టకుండా పైసా పైసా కూడబెట్టమని కాబోలు వీడి సలహా!

"అది ఆమె ఇష్టం! ఆమె జీతం, ఆమెకి ఇష్టమైనట్టు చేసుకుంటుంది. అది మీకు అనవసరం!"

"సరే, జీతం ఇస్తే ఇస్తుంది. తల్లిని చెల్లెలు చూసుకుంటూనే వుందిగా? ఇంకా చీటికీ మాటికీ తను బైల్దేరుతుంది ఎందుకూ?"

అదీ! అసలు ఏడుపు అదన్నమాట!

"ఈమె అక్కడికి వెళ్ళకుండా ఉండాలంటే, తల్లిని కూడా తెచ్చి ఇక్కడే పెట్టి చూసుకోమనండి! మీ అద్దె వాటాల్లో ఒక గది ఖాళీ చేయించి, ఆమె తల్లికోసం ఇవ్వండి! అలాంటి ఏర్పాటు చేస్తే, నాగమ్మ నిశ్చింతగా తల్లినీ చూసుకుంటుంది, మిమ్మల్నీ చూసుకుంటుంది ... అంతేకాదు, ఆ ఇస్త్రీల కుర్రాడి దగ్గిర అద్దె తీసుకోడం ఏమిటి? ఆ షెడ్డు ఆ కుర్రాడికి ఇచ్చెయ్యండి! మీకు సహాయంగా వుంటాడు. మీకు చాలా మంచి పని మనుషులు దొరికారు. వాళ్ళని జాగ్రత్తగా చూసుకుంటే, వాళ్ళు కూడా మిమ్మల్ని ప్రేమగా చూసుకుంటారు. చక్కగా సంగీతం తోటీ, సాహిత్యం తోటీ

గడపండి! హాయిగా ఉంటుంది జీవితం."

శర్మ నవ్వాడు — "భలే చెపుతారే మీరు పరిష్కారాలు!"

"ఏం, 'భలేగా' లేదా?... అయితే, మనవళ్ళకి బళ్ళు కొనిపెట్టండి! డొనేషన్లు కట్టండి! కానీ, వాళ్ళు మీకు గ్లాసుడు మంచి నీళ్ళు కూడా అందించరు. ఆస్తులన్నీ కూడబెట్టి పిల్లలకి అప్పజెప్పండి! కానీ, వాళ్ళు మిమ్మల్ని ఎలా వొదిలించు కుందామా అని ఓల్డ్ హోముల అడ్రసుల కోసం వెతుకుతూ వుంటారు. కాబట్టి, మీకు ఏది 'భలేగా' వుంటుందో అదే ఎంచుకోండి!"

"మీరు చాలా ఆవేశపరులు సత్యం గారూ! ఎన్ని ఏర్పాట్లు చేసినా పనివాళ్ళు ఎల్లకాలం నమ్మకంగా పని చేస్తారని అనుకోకండి! 'ఇలా చెయ్యి, అలా చెయ్యి' అనాలంటే, నాగమ్మ ఇప్పుడు నా మాటకేం విలువ ఇస్తుంది? భార్యాభర్తలమైతే ఆ దారి వేరు. ఏం చెప్పకోడానికైనా ఒకరి మీద ఒకరికి హక్కు వుంటుంది. ఆమెకి నేను అన్యాయం చేస్తానా చెప్పండి?"

ఈ గుంటనక్కతో ఇంకా మర్యాదగా మాట్లాడవలసిందేనా?

"నాగమ్మని ఇల్లు కదలనివ్వకుండా చెయ్యాలనా మీ ఆలోచన? నాగమ్మ నిజంగా మీ మాటలు నమ్మిందంటే, మీతో మూడు ముళ్ళూ కట్టించుకుని, మీ ఆజ్ఞలకు లోబడి, ఓ పదేళ్ళపాటు మీకు సేవలు చేస్తుంది. అంతా మామూలుగా జరిగితే, ఆమెకన్నా ముందు మీరుపోక తప్పదు. అప్పుడు ఆమె మళ్ళీ 'అండ'కోసం, ఇంకో వృద్ధుణ్ణి చేసుకుని, ఇంకో ఐదేళ్ళో పదేళ్ళో అతనికి సేవలు చేస్తుంది. అతనూ పోక తప్పదు. అలాగ రెండుసార్లో మూడుసార్లో జరిగేటప్పటికి ఈ ఆడ మనిషే వృద్ధురాలవుతుంది. అప్పుడు ఈమెకి 'అండ'గా వుండడానికీ, ఈమెకి సేవలు చెయ్యడానికీ, ఈమెకన్నా చిన్న వయసు మొగవాడెవడైనా ఈమెని పెళ్ళి చేసుకుంటాడా? అది జరగదని వేరే చెప్పాలా? 'ఒకరికొకరం అండ, అండ' అంటున్నారు! అండ అంతా మొగాళ్ళ కోసమే. ఆడవాళ్ళ కోసం కాదు."

శర్మ మొహం బిగుసుకుంది. కానీ నవ్వడానికే ప్రయత్నించాడు. "మీరు లక్ష అన్నా ఎదురు చెప్పకుండా ఊరుకోవలిసిందే నేను. మీరు చేసిన ఉపకారం నన్ను నోరెత్తనిస్తుందా చెప్పండి? కానీ..." అంటూ చురుగ్గా లేచి పుస్తకాల బీరువా తలుపులు తెరిచి గబగబా దేనికోసమో వెతికాడు. రెండు పత్రికలు బైటికి లాగాడు. వాటిని సత్యం ముందు టేబుల్ మీద పెడుతూ "మీ చైనా పత్రికల్లోనే ఏం రాశారో చూడండి. ఈ మధ్యెప్పుడో ఒకాయన తెచ్చి ఇక్కడే పడేశాడు. మొన్న గుర్తొచ్చి మళ్ళీ చూశాను. చూడండి ఒకసారి" అంటూ మళ్ళీ కుర్చీలో కూర్చున్నాడు.

సత్యం ఆశ్చర్యపోతూ ఆ పత్రికలు తీశాడు. 'బీజింగ్ రివ్యూ' పత్రికలు అవి. విదేశీ పెట్టుబడుల్ని ఆహ్వానిస్తూ చైనాలో స్పెషల్ జోన్స్ ఏర్పాటుచెయ్యడం ఎంత గొప్ప విప్లవమో వర్ణిస్తూ ఆ పత్రికలనిండా వ్యాసాలు వున్నాయి. అందులో ఒక పత్రిక 1987 సెప్టెంబరులోది. అందులో, 'వృద్ధుల సమస్య' మీద కూడా ఒక వ్యాసం వుంది. ఆ సమస్యకు ఆ వ్యాసం చెప్పిన అద్భుత పరిష్కారం 'వృద్ధుల పెళ్ళిళ్ళు!'

సత్యం ఆతృతగా ఆ వ్యాసం చదవడం ప్రారంభించాడు.

చైనాలో 1981లో 'నూతన వివాహ చట్టం' వచ్చిందట. అప్పటినించీ 50 సంవత్సరాలకు పైబడ్డ వాళ్ళ మళ్ళీ పెళ్ళిళ్ళకోసం చాలా పట్టణాల్లో మ్యారేజీ బ్యూరోస్ పుట్టుకొచ్చాయి.

పెద్దతనం వచ్చాక తండ్రి చచ్చిపోయి తల్లి మిగిల్తే ఆవిడ పని కొంచెం నయం. ఆవిడ ఇంటి పనులు చేస్తుంది కాబట్టి ఆ మనిషిని పిల్లలు ఏదో రకంగా కొంచెం భరిస్తారు. కానీ తల్లిపోయి తండ్రి మిగిల్తే ఆ మనిషిని బైటికి తోసెయ్యవలిసిందే! ఆయన మరీ రాజసం వెలగబెట్టకుండా ఇంట్లో కాస్తోకూస్తో పనులు చేస్తే, అతని పరిస్థితి తేడాగా వుండేదేమో! కానీ, మొగపిల్లలకు చిన్నతనం నించీ ఇంట్లో పనులు నేర్పరు కదా? అలాంటి మొగవాళ్ళు డెబ్భయ్యో ఏట ఏం పనులు నేర్చుకుంటారు? మళ్ళీ కొత్త భార్యని సంపాదించుకుంటే పోలా, చాకిరీకోసం?

నాంకింగ్ నగరంలో 73 ఏళ్ళ ఇంజనీరు ఒకాయనకి భార్య పోయింది. నలుగురు పిల్లలూ కుటుంబా

లతో ఎక్కడెక్కడో వున్నారు. వాళ్ళు తండ్రిని కూడా తమతో వుంచుకుని చూసుకోవచ్చు. కానీ చూసుకోడం లేదు. ఈయన ఒంటరి. పనిచేసి పెట్టే మనిషి కావాలి. 58 ఏళ్ళ రిటైరైన ఒక కార్మికురాల్ని ఒక పెళ్ళిళ్ళ సంస్థ వాళ్ళు కుదిర్చి పెళ్ళి చేశారు. "మేం సుఖంగా వున్నాం" అని ఆ వృద్ధ ఇంజనీరు, ఆ పెళ్ళిళ్ళ సంస్థ వాళ్ళకి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. కొత్త భార్యని సప్లై చేసిన వాళ్ళకి ఆ మాత్రం కృతజ్ఞతలు చెప్పుకోవద్దా మరి?

దాయ్ అనే సైనికాధికారికి 70 ఏళ్ళు. భార్య పోయింది. ఈ భార్యలేవిటో మరీ కంగారు. భర్తలకన్నా ముందే పోతారు. దాయ్‌కి కొడుకూ కోడలూ మన వలూ కూడా వున్నారు. అందరూ కలిసే వున్నారు. దాయ్‌కి, ఒక పెళ్ళిళ్ళ సంస్థవారు, చెన్ అనే 53 ఏళ్ళ ఒక ఫ్యాక్టరీ వర్కర్‌తో కొత్త పెళ్ళి చేశారు. పెళ్ళి కూతురు, కొత్త భర్తగారింటికి రాగానే పనులు మొదలుపెట్టింది. లేవగానే రూములు క్లీన్ చేస్తుంది. తర్వాత ఇంటిల్లిపాదికీ టిఫెన్ చేస్తుంది. తర్వాత మధ్యాన్నం భోజనం తయారుచేసి పెట్టేసి ఫ్యాక్టరీకి వెళ్ళిపోతుంది. సాయంత్రం వచ్చాక రాత్రి వంటా మిగతా పనులూ చేస్తుంది. రోజూ అదే కత! ఇంట్లో అందరూ తలోపనీ చేసుకోవాలి కదా? కానీ, ఎవ్వరూ చెయ్యరు. దాయ్‌గారి కోడలు "మా మావగారు చాలా మంచి అత్తగార్ని ఇంటికి తెచ్చారు" అని అందరికీ చెప్పుకుని సంతోషిస్తోంది.

అన్నీ అలాంటి ఉదాహరణలే! ప్రతీ పెళ్ళిలోనూ ఆడవాళ్ళ కన్నా మొగవాళ్ళే పెద్ద వాళ్ళు. ఆడవాళ్ళం దరూ చాకిరీలు చెయ్యడానికి పనికొచ్చే వయసులో వున్నవాళ్ళు. రేపు వాళ్ళు కూడా పెద్దయ్యాక వాళ్ళ గతి ఏమవ్వాలో!

ఈ వృద్ధుల పెళ్ళిళ్ళు మరీ బాగా 'విజయవంతం' అవడంలేదని ఆ వ్యాసం చాలా గోలపెట్టింది. ఆడ వాళ్ళ 'చాదస్తపు భావాలవల్ల' వాళ్ళు మళ్ళీ పెళ్ళిళ్ళ కోసం మరీ ఎక్కువగా ఎగబడడం లేదట! పెళ్ళిళ్ళ సంస్థల్లో, సంబంధాల కోసం రిజిస్టర్ చేసుకున్న క్లయింట్లలో చాలా ఎక్కువ మంది, మొగవాళ్ళేనట! ఫలానా సంస్థలో మొగ క్లయింట్లు 13 మంది అయితే, ఆడ క్లయింట్లు ఒక్కరే. ఇంకో సంస్థలో, మొగ వాళ్ళు 14 మంది అయితే ఆడవాళ్ళు ఒక్కరే. ఆ ఒక్క ఆడ క్లయింటూ కూడా, ఆ 14 మంది పెళ్ళి కొడుకుల్లో నించి అన్నీ నచ్చినవాడినే ఎంచుకుంటుంది. ఆ ఆడ క్లయింటు ఒక్క మొగవాడినే పెళ్ళాడి, మిగతా వాళ్ళని వొదిలేస్తే, మరి వాళ్ళ సమస్య ఎలా పరిష్కారం అవ్వాలి? 'పాపం' వాళ్ళూ వృద్ధులేగా? కాబట్టి ఆవిడ, ఆ 14 మంది మొగవాళ్ళనీ పెళ్ళి చేసేసుకుంటే అందరి సమస్యా పరిష్కారమై పోతుంది. బహుశా ఈ పద్ధతి ఇంకా తర్వాత కాలంలో పెడతారేమో! వివాహ చట్టాన్ని మళ్ళీ మారిస్తే సరిపోతుంది.

ఏ మాటకామాటే చెప్పుకోవాలి. ఆ వ్యాసం కొన్ని నిజాలు కూడా బయటపెట్టింది. — చాలా మంది ఆడవాళ్ళు "ఆఁ, మనతో చాకిరీలు చేయించుకోడా నికే ఈ పెళ్ళిళ్ళు!" అని ఈసడిస్తున్నారట!

అలాగే మొగవాళ్ళు కూడా "మన ఆస్తి కొట్టెయ్యా డానికే ఆడవాళ్ళు మనతో పెళ్ళిళ్ళకి వొప్పుకుంటు న్నారు. అంతకన్నా ఏం లేదు" అని సందేహిస్తూనే వుంటారట!

చిన్న వయసు పెళ్ళిళ్ళలో 'సోషల్ స్టేటస్' చూసు కున్నట్టే, ఈ పెద్దవాళ్ళ పెళ్ళిళ్ళలో కూడా అన్ని హంగులూ చూసుకుంటారట! ఆఖరికి 'అందాల' కోసం కూడా! అరవైలూ డెబ్భైలూ దాటిన వాళ్ళు కూడా ముప్పైలో వున్నట్టే వుండాలట! పెద్ద వయసులో అందచందాలు నచ్చకపోవడం మూలాన్న కూడా చాలా మంది తాతయ్యలకూ, అమ్మమ్మలకూ సంబం ధాలు కుదరడం లేదట!

సున్ అనే ఆవిడకి ముగ్గురు పిల్లలు పుట్టాక చిన్న వయసులోనే భర్త పోయాడు. ఆవిడ, ఆ వయసులో మళ్ళీ పెళ్ళి చేసుకోవచ్చు, చేసుకోవాలనుకుంది కూడా. కానీ, అప్పుడు ఆవిడికి ఏ మంచి మొగాడూ దొరకలేదు. అందరూ ఆవిడతో "నీ పిల్లలు వొద్దు, నువ్వు కావాలి" అన్నవాళ్ళే. సరే, ఆవిడ అలాగే కాలం గడిపింది. రిటైర్ కూడా అయింది. పిల్లలు పెద్ద వాళ్ళయ్యారు. ఎవరిదారిన వాళ్ళు వున్నారు. ఇప్పుడు పిల్లల్ని తన దగ్గిర పెట్టుకోనక్కరలేదు కాబట్టి, ఆవిడ ఇప్పుడైనా మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనుకుందట. ఒక ముసిలాడు ఒప్పుకున్నాడు. వాడు కూడా ఎందుకు

ఒప్పు కున్నాడంటే, ఆమె, పిల్లలు లేకుండా ఒంటరిగా తన దగ్గిరికి వొస్తుంది కాబట్టి. పిల్లలతో వున్న చిన్న వయసు ఆడమనిషిని అయితే, ఆ ముసిలాడు కూడా ఒప్పుకోడు. ఆ ఆడ మనిషికి అసలు బుద్ధివుందా? తన వయసు కాలంలో, ఒక్క మంచి మనిషి కూడా దొరక్క ఒంటరిగా బతికిన ఆ మనిషికి, రిటైర్ కూడా అయ్యాక, అరవై ఏళ్ళకి, ముసలి భర్తతో పెళ్ళి ఎందుకు? తీరా చేస్తే, ఆమె, పెళ్ళికొడుకుని వెతుక్కున్నాక, తల్లి పెళ్ళికి, కూతుళ్ళు ఒప్పుకున్నారు గానీ, కొడుకు ఒప్పుకోలేదు! ఇక చేసేదిలేక, ఆమె ఆ ప్రయత్నం మానుకుంది.

గడుసు ఆడవాళ్ళు చాలా మంది, మొదటి పెళ్ళి వల్ల తీరని ముచ్చట్లన్నీ రెండో పెళ్ళిద్వారా అయినా తీర్చుకోవాలని సరదా పడుతున్నారు. వాళ్ళ షరతులు ఏమిటంటే — పెళ్ళికొడుకు (అదే, 70 ఏళ్ళ పెళ్ళి కొడుకు), చాలా అందంగా వుండాలి. మనవలూ మునిమనవలూ వున్నా, ఆ వరుడు జుట్టు నెరవకుండా, పళ్ళు ఊడకుండా మొహం వాడకుండా, కలకల్లాడిపోతూ వుండాలి! జబ్బులూ గిబ్బులూ లేకుండా ఆరోగ్యంతో బలిష్టంగా వుండాలి! 'ఆదర్శవంతమైన' ఎత్తు వుండాలి. ఆయనకి 'ఆస్తి' వుండాలి! మంచి ఆదాయం వుండాలి. విశాలమైన ఇల్లు వుండాలి. పిల్లలులేని వాడైతే మంచిది. పిల్లలు వుంటే, వాళ్ళ బాదరబందీ లేకుండా అన్నీ సెటిల్ చేసుకొన్నవాడై వుండాలి.

"చచ్చిపోయిన పాత భర్తకన్నా ఈ రెండోవాడు మెరుగ్గా వున్నాడా లేదా" అని ఇద్దర్నీ తరాజులో పెట్టి తూచి, కొత్తవాడు బరువుగా తూగితేనే ఆడవాళ్ళు మళ్ళీ పెళ్ళిలోకి దిగుతున్నారు. అందుకే, వివాహ సంస్థల వారికి, తగినంత మంది పెళ్ళి కూతుళ్ళు దొరకడం లేదు.

సత్యం, ఆ పత్రికలు చదువుతూ మధ్యలోనే చాలాసార్లు గిరాట్లు కొడదామనుకున్నాడు. అయినా ఇంకా చూద్దామని గబగబా చదివాడు.

యవ్వన దశలో జరిగే పెళ్ళిళ్ళల్లో అయితే, 'ప్రేమ'ని తప్ప దేనినీ లక్ష్యపెట్టని వాళ్ళు అనేక మంది వుంటారు. వాళ్ళు అందచందాల్ని లక్ష్యపెట్టరు. ఆస్తిపాస్తుల్ని లక్ష్యపెట్టరు. కుల మతాల్ని లక్ష్యపెట్టరు. వ్యక్తి మీద అనురాగాన్ని తప్ప, రెండో అంశాన్ని దేన్నీ లక్ష్యపెట్టరు. ప్రేమించిన వ్యక్తి దొరక్కపోతే జీవించడమే వ్యర్థం అనుకుని ఆత్మహత్యలకు కూడా సిద్ధపడతారు. ఇద్దరు స్త్రీ పురుషుల్ని, కలిసి బతికేలా చేసే అసలు శక్తి అదీ! ఆ 'ప్రేమ'!

కానీ 'పెళ్ళి'కీ, 'వార్ధక్యానికీ' ఎలా పొసుగుతుంది? వృద్ధుల పెళ్ళిళ్ళలో వుండేవన్నీ బిజినెస్ షరతులు! "ఈ ఆడ మనిషి చాకిరీకి పనికొస్తుందా?" అని మొగవాడు చూస్తే, "ఈ మగవాడి దగ్గిర డబ్బు వుందా?" అని ఆడమనిషి చూస్తుంది.

పిల్లలు బొత్తిగా పట్టించుకోక, నిరాధారంగా అయిపోయిన ఆడవాళ్ళుగానీ, కొత్త మొగుడితో ఏదో బాముకుందామని తెలివి తక్కువగా నమ్మే వాళ్ళుగానీ, ఈ రకం పెళ్ళిళ్ళకి లోబడతారు.

ఒక సంవత్సరంలో జరిగే మొత్తం పెళ్ళిళ్ళలో, ఈ రకం వృద్ధుల పెళ్ళిళ్ళు 7% ఉంటున్నాయని ఆ వ్యాసం సంతోషించింది. చెప్పాలంటే, అదిచాలా పెద్ద శాతమే.

"అసలు పడుచుతనం పెళ్ళిళ్ళు ఏం బాగుండేడుస్తాయి? నిజమైన ఆనందం అంతా డెబ్భై దాటాక జరిగే పెళ్ళిళ్ళలోనే వుంటుంది" అంటూ ఆ వ్యాసం, తాతలకూ బామ్మలకూ జరిగే పెళ్ళిళ్ళని తెగ పొగిడి పారేసింది. పెళ్ళి పందిళ్ళ నిండా మనవలూ, మునిమనవలూ తిరుగుతూ వుంటేనే ఆ పెళ్ళిళ్ళు సందడిగా ఉంటాయి కాబోలు!

సత్యం గబగబా చదవడం పూర్తిచేసి "బుద్ధిలేని థర్డ్ రేట్ వ్యాసం" అంటూ ఆ పుస్తకాల్ని టేబుల్ అడుక్కి విసిరికొట్టాడు.

"ఆఁ...." అని నోరు తెరిచాడు విజయవాడ ముసలాయన. సత్యం ఆ పత్రికలు అంత శ్రద్ధగా చూస్తోంటే, అతను తప్పకుండా మారతాడని అప్పటిదాకా ముసలాయన ఊహిస్తున్నాడు. ఆశిస్తున్నాడు.

"చైనా కంపెనీలు ఈ పెళ్ళిళ్ళ బిజినెస్ బాగా చేస్తున్నాయి! 'కేపిటలిజం'లో, డబ్బు సంపాదన కోసం కుళ్ళు కుళ్ళు ఆలోచనలన్నీ పుట్టిస్తారు!'

"అదేవిటి? చైనా సోషలిష్టు దేశమే కదండీ?"

"అదంతా ఎప్పుడో పోయింది! పెళ్ళి కూతుళ్ళనీ, పెళ్ళి కొడుకుల్నీ 'క్లయింట్లు' అంటున్నారంటే, ఆ కంపెనీలు బీజినెస్ కోసం పుట్టుకొచ్చాయని తెలియడం లేదూ?" అని సత్యం విసిరేసిన పుస్తకాల వేపు కోపంగా చూశాడు.

బల్ల కింద పడ్డ పత్రికల్ని ఎగాదిగా చూస్తూ శర్మ "బొత్తిగా అలా అనెయ్యకండి! చైనా పత్రికలు అవి! అలా తీసిపారేశారేమిటి?" అన్నాడు నీరసంగా.

"చైనావి అయితే ఎవడిక్కావాలి, అమెరికావి అయితే, ఎవడిక్కావాలి? ఎక్కడ చెప్పారనేది కాదు, ఏం చెప్పారనేది కావాలి. ఏం చెప్పారు అందులో; మొగాళ్ళకు ముసలితనంలో కూడా చాకిరీలు చేసే కొత్త భార్యల్ని సప్లై చేసే సిద్ధాంతం చెప్పారు. అందుకే మీకది అంత బాగా నచ్చింది. మరి ఆడవాళ్ళకి పెద్ద తనంలో అండ ఎవరు?

తల్లులకైనా తండ్రులకైనా, అసలైన అండ పిల్లలే! పిల్లలు లేకపోతే, పిల్లల్లాంటి చిన్నతరం వాళ్ళు ఎవరో ఒకరు!

పెద్ద వయసు సమస్యల గురించి నిజంగా బాధ్యతగా చెప్పదలిస్తే, మొదట పిల్లలకు గడ్డిపెట్టాలి. 'రేపు మీరూ పెద్ద వాళ్ళవుతారు. తల్లిదండ్రులతో పశువుల్లా ప్రవర్తించకండి!' అని వాళ్ళని హెచ్చరించాలి. అలాంటి మాట ఒక్కటి కూడా లేదు ఆ వ్యాసంలో!

అంతేకాదు, పెద్దవాళ్ళకి కూడా గడ్డి పెట్టాలి. లక్ష్య పెట్టని పిల్లలతో తెగతెంపులు చేసుకోవాలి వాళ్ళు. తమకున్న కాస్తోకూస్తో ఆస్తిని, తమని చూసుకునే వాళ్ళకే అప్పగించడం నేర్చుకోవాలి. అలా చేస్తే, దూరపు బంధువులో, ఇరుగు పొరుగులో, ఎవరో ఒకరు శ్రద్ధగానే చూసుకుంటారు. అంతదాకా ఎందుకండీ, **ఆస్తి తమకు దక్కకుండా పోతుందని తెలిస్తే, పిల్లలే ఒళ్ళు దగ్గిర పెట్టుకుని ప్రవర్తిస్తారు.** ఈమాత్రం దానికి, చచ్చే వయసులో పెళ్ళిళ్ళా?

'ప్రేమ' అంటే, 'పెళ్ళి' అంటే, 'సంసారం' అంటే, అది యవ్వన దశలో ఏర్పడవలసిన సంబంధం. ఆ విషయాలు, బాల్యంలోనూ జరగకూడదు, వృద్ధాప్యంలోనూ జరగకూడదు. ఇంత చిన్న విషయం అర్థం కాలేదా మీకు?"

ముసలాయన కాస్సేపు గుటకలు మింగాడు. చివరికి అన్నాడు — "చూడండీ! ఎవరి బాధలు వాళ్ళవి! ఎవరికి తోచినట్టు వాళ్ళు చేసుకుంటారు. మీలాగ ఆలోచించే వాళ్ళూ ఉండొచ్చు, నాలాగ ఆలోచించే వాళ్ళూ ఉండొచ్చు. ఏమంటారు?"

ఆయన అభిప్రాయం వీసమంతయినా మార లేదని సత్యానికి అర్థమైంది. లేచి నిలబడ్డాడు "ఏవంటాం? పాతకాలం వాళ్ళు ఏ తప్పుచేసినా కాస్త సిగ్గుపడే వాళ్ళు. వాళ్ళూ చేసుకున్నారు పెద్ద వయసు పెళ్ళిళ్ళు. కానీ చాలా సిగ్గుపడ్డారు. 'ఎవరి ఇష్టం వాళ్ళది' సిద్ధాంతంతో వాళ్ళు దబాయింపులు చెయ్య లేదు.

పాతకాలం వాళ్ళందరూ కులాల్నీ మతాల్నీ పాటించినా, అందుకు కొందరైనా బాధపడ్డారు. ఇప్పుడు కులాల్నీ మతాల్నీ ఎంత గట్టిగా చాటుకుంటే అంత 'విప్లవం'!

పాతకాలంలో ఆడా మొగా కూడా తిరుగుబోతుతనాల్ని చెప్పుకోడానికి సిగ్గుపడే వాళ్ళు. ఇప్పుడు, ఎంత తిరుగుబోతులుగా ప్రకటించుకుంటే అంత 'స్వేచ్ఛ'!

ఇప్పుడు ప్రతి సిగ్గుమాలిన పనీ, ప్రతీ తప్పుడు పనీ, గొప్ప సిద్ధాంతం! ఎవరి స్వంత అవసరాల్ని బట్టే వాళ్ళ సిద్ధాంతం!

కాబట్టి, మీరు నిశ్చింతగా ముందడుగు వెయ్యండి! మీ పెళ్ళికి హాజరయ్యే వాళ్ళు అనేక మంది వుంటారు!" అనేసి, సత్యం గబగబా బయటికి వచ్చేశాడు.

గేటు దగ్గిర నిలబడివున్న ఇస్త్రీల కుర్రాణ్ణి "నాగమ్మ వచ్చిందా?" అని అడిగాడు.

"ఎప్పటినించో మీకోసం చూస్తుందయ్యా!" అన్నాడా కుర్రాడు.

నాగమ్మ గోడచాటున కనపడింది.

సత్యం గబగబా అటు వెళ్ళాడు.

"నాగమ్మగారూ! శేఖర్ మీకో మాట చెప్పమన్నాడండీ! 'నన్ను తీసికెళ్ళిపొమ్మని మా పెద్దమ్మకి చెప్పండీ, నేను ఇక్కడ వుండను' అని చెప్పాడు. ఆ

మాట చెప్పడానికే నేనిక్కడికి వచ్చాను. ఈయన్ని చూడ్డానికి కాదు. శేఖర్ని వెంటనే తెచ్చేసుకోండి!" అన్నాడు.

నాగమ్మ తెల్లబోయింది "అలా అన్నాడా! మొన్న అయ్యగారితో రానని చెప్పాడయ్యా."

"అదంతా అబద్ధం. నమ్మకండి!"

"అః...." అని ఆశ్చర్యపోయింది నాగమ్మ కాస్సేపు "నేను కూడా అనుకున్నానయ్యా! 'అలాగంటాడా' అని అనుమానం పడ్డానయ్యా!.... రేపే పంపిస్తానయ్యా ఈ కుర్రాణ్ణి. మీరెప్పుడెళ్తారయ్యా? మీతోటే పంపిస్తాను."

"ఇవ్వాళ రాత్రే వెళ్తాను. స్టేషన్‌కి రమ్మనండి! పిల్లల్ని పొరుగూళ్ళల్లో పెట్టకూడదండీ! పెద్దవాళ్ళయితే ఎక్కడికి పోయినా ఎలాగో బయటపడగలరు. చిన్న పిల్లలు అలా చెయ్యలేరు."

నాగమ్మకి గిర్రున కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "ఇంకెక్కడకీ పంపనయ్యా!.... ఈ ముసలాయన నన్ను నిలబడనివ్వ లేదయ్యా! నా ప్రాణాలు తీసేసి పిల్లాణ్ణి తీసికెళ్ళాడయ్యా! అక్కడ చదువు చెప్పిస్తామని కూడా అన్నారయ్యా!"

సత్యం కొంచెం నవ్వాడు. "నాగమ్మ గారూ! ఈయన మీ ప్రాణాలు ఇంకా తీస్తాడు. అప్పుడే అయి పోలేదు.... ఈ మధ్య ఏవన్నా పిచ్చిపిచ్చి మాటలు అంటున్నాడా?"

"ఏంటయ్యా?"

"నాగమ్మని పెళ్ళిచేసుకుంటాను, ఒక వాటా రాసి ఇస్తాను — అన్నాడు నాతో. ఇవ్వాళో రేపో మిమ్మల్ని కూడా అడుగుతాడు."

నాగమ్మ తెల్లబోయింది. ఆశ్చర్యపోయింది. సిగ్గు పడిపోయింది. కోపంగా చూసింది — ".... అదా? అందుకా? ఈ మధ్య అప్పుడప్పుడూ 'మీ ఆయన పోయి ఎంతకాలం అయింది, మళ్ళీ పెళ్ళి చేసుకో లేదేం?' అని అడుగుతున్నాడు. ఏదోలే, వూరికేలే — అనుకున్నాను. మొన్న చచ్చే వాడిలాగా తయారై వొచ్చాడు ....... నన్ను పెళ్ళి చేసుకుంటాడా? అంత తేరగా ఉన్నాననుకున్నాడా?.... పెళ్ళి చేసుకోవాలంటే, ఇంతకన్నా వయసోడు దొరకడా నాకు? ఛీ! ఏం పుట్టిందయ్యా బుద్ధి లేనోడికి?.... ఎన్నిసార్లు ముండ మోస్తాననుకున్నాడు?"

సత్యం కళ్ళు మిలమిల్లాడాయి ఆనందంతో. "మీకో వాటా రాస్తానన్నాడే!" అన్నాడు చిరునవ్వుతో.

"ఎవడిక్కావాలయ్యా ఈడి వాటా? పుట్టినప్ప ట్నించీ ఈ వాటాల్తోటే బతికానా? రెక్కల కష్టంతో బతికాను. నెలనెలా నా జీతం నాకు పడేస్తే చాలు, ఏడిపించకుండా!"

సత్యం నవ్వాడు "సెభాష్‌గా మాట్లాడారు! ఆ ముసిలాడి కిలాడీ మాటలకి ఎక్కడ లొంగిపోతారో అని నేను భయపడి పోయాను. కూతురేమో ఈయన్ని హోమ్‌లో పెట్టాలని చూస్తోంటే, ఈయనేమో కొత్త పెళ్ళికొడుకవుదామని సంబర పడుతున్నాడు. అలా వున్నాయి వీళ్ళ ఆలోచనలు! తండ్రిని దగ్గిర పెట్టు కోవాలని పిల్లలకీ లేదు, పిల్లలు తనని చూసుకోడం లేదే అని తండ్రికీ లేదు. భారం అంతా మీ నెత్తిన పడేద్దామనుకుంటున్నాడు."

"మా అమ్మ దగ్గిరకి వెళ్తే కళ్ళల్లో నిప్పులు పోసు కుంటాడయ్యా! 'అయిందా తల్లిగారి సేవ' అంటాడు. తినీతినకా మమ్మల్ని పెంచిందయ్యా! ఇవ్వాళ మంచానపడ్డాక ముసిల్దాన్ని నేవొదిలేస్తే ఎలా గయ్యా?.... లాభం లేదయ్యా! ఇక్కడ పని మాను కుంటాను."

సత్యం వారించాడు.

"అలా అక్కర్లేదు. ఎక్కడ పని చేసినా యజ మానులందరూ ఒకటే. అందరూ ఇలాగే వుంటారు. అలవాటైన చోట మానుకోడం ఎందుకు? ఎప్పటిలాగే మీ పనులు మీరు చేసుకోండి. జీతం ఖచ్చితంగా తీసుకోండి. 'పెళ్ళి, పెళ్ళి' అని పిచ్చిపిచ్చిగా మాట్లాడితే ఒకసారి గట్టిగా చెప్పెయ్యండి! ఇంకా విసిగిస్తోంటే, చెప్పుతో పళ్ళురాలగొట్టి బయటికి వొచ్చెయ్యండి! తల కాయలు పుచ్చి ఏడుస్తున్నారు పనికి మాలిన మంద! చెప్పు అందుబాటులో పెట్టుకోడం మరిచిపోకండి!" అని హెచ్చరించాడు.

నాగమ్మ నోరంతా తెరిచి, మొహం కల కల్లాడుతూ నవ్వింది.

[19-1-1998 'ఆంధ్రప్రభ' వారపత్రికలో] ★